RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 49 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, ఆగస్టు, 7, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 49 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, August, 7, 2025 | PAGES : 8 RS : 4 /- |




అమిత్ షాపై పరువునష్టం కేసులో..

## రాహుల్ గాంధీకి ఊరట

- ఝార్ఖండ్‌లోని చాయ్‌బాసా కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నేత

ఢిల్లీ,: కేంద్ర హెూంమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి బుధవారం ఝార్ఖండ్‌లోని చాయ్‌బాసా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ హాజరు అనంతరం న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చాయ్‌బాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి ఈ కేసు దాఖలు చేశారు.



కర్తవ్యభవన్‌ను ప్రారంభించిన

## ప్రధాని మోదీ

ఢిల్లీ, : దేశరాజధాని ఢిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రకటించింది. వాటిలో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్‌లోకి కేంద్ర హెూంశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, పెట్రోలియం శాఖలతోపాటు ప్రధానమం త్రికి ముఖ్య శాస్త్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయాలు తరలివెళ్లనున్నాయి. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే. ప్రస్తుతం శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే నూతన భవనాల్లోకి క్రమంగా మారిపోతాయి. అన్ని కార్యాలయాలు కొత్త భవనాల్లోకి మారిన తర్వాత పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలువనున్నట్లు సమాచారం.



రష్యా నుంచి మీరూ కొంటున్నారుగా..

భారత్ ప్రశ్నకు నీళ్లు నమిలిన

## ట్రంప్!

- రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై భారత్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

వాషింగ్టన్: రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అదే సమయంలో తమ దేశం రష్యా నుంచి చేస్తున్న దిగుమతులపై మాత్రం ఆశ్చర్యకరమైన సమాధానం ఇచ్చారు. రష్యా నుంచి అమెరికా కూడా యురేనియం, ఎరువులు వంటివి కొనుగోలు చేస్తోందన్న భారత వాదనపై స్పందిస్తూ, "ఆ విషయం గురించి నాకు ఏమీ తెలియదు. దానిపై నేను ఒకసారి చెక్ చేయాలి" అని బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని, లేదంటే భారత ఉత్పత్తులపై భారీగా టారిఫ్‌లు (సుంకాలు) పెంచుతామని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. "రాబోయే 24 గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించడం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచింది. రష్యా యుద్ధానికి భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందని ఆయన ఆరోపించారు. అయితే, ట్రంప్ హెచ్చరికలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది.



బీసీలపై కాంగ్రెది

## దొంగ ప్రేమ

**50ఏళ్ల పాలనలో బీసీలకు ఎనలేని నష్టం : బండిసంజయ్**

హైదరాబాద్,తెలంగాణ దిశ: 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీలను పట్టించుకున్న దాఖలాలు ఉన్నాయా?.. సీఎంను చేసిన లెక్కలు ఉన్నాయా ఉంటే చెప్పాలని కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని ఆరోపణలు చేశారు. ఇది కామా రెడ్డి డిక్లరేషన్ కానే కాదని.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనేనని విమర్శలు చేశారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని రాష్ట్రపతిపై

మోదీ ఒత్తిడి తెచ్చారనేది

## మా అనుమానం

- తెలంగాణ అసెంబ్లీ పంపిన బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉన్నాయన్న రేవంత్
- రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దొరకలేదని విమర్శ
- బీసీ రిజర్వేషన్లను ఆమోదించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య : రేవంత్ రెడ్డి

హైదరాబాద్,తెలంగాణ దిశ: రాహుల్ గాంధీ ఆశయం మేరకు తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ బిల్లు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లును అసెంబ్లీలో పాస్ చేశామని చెప్పారు. దేశానికి ఆదర్శంగా నిలిచేలా తెలంగాణలో కులగణన జరిగిందని అన్నారు.


**కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు**



ప్రజలను భ్రమ పెట్టేందుకే

## ఢిల్లీలో ధర్నాలు

హైదరాబాద్,తెలంగాణ దిశ: బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు.



కోమటిరెడ్డి బ్రదర్స్

## కిం కర్తవ్యం.. 20

నల్గొండ, ఆగస్టు 6,తెలంగాణ దిశ: సీఎం రేవంత్ రెడ్డి ఏం మాట్లాడి నా, దానిని వ్యతిరేకిస్తూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ట్వీట్ చేయడంతో వార్తలకెక్కుతున్నాడు. గతంలో రేవంత్ రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేసిన రాజగో పాల్ రెడ్డి ప్రస్తుతం ట్వీట్ లు మాత్రమే చేస్తున్నారు. తాజాగా సోషల్ మీడియాపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉటంకిస్తూ కోమటిరెడ్డి బ్రదర్ చేసిన ట్వీట్ మళ్లీ చర్చకు దారితీసింది. దానికి కారణాలు ఏమైనా, రేవంత్ రెడ్డిని విమర్శించేందుకు మాత్రం మంత్రి పదవి ఇవ్వలేదనే కోపమే అని అంటున్నారు.గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీ లో చేరి ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ఆయన తిరిగి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్ లో చేరిన ఆయనకు సమయం అనుకూలించలేదు. పీసీసీ పగ్గాలు రేవంత్ రెడ్డి కి అప్పగించిన తరువాత ఏకంగా అప్పటి ఇంచార్జి కి డబ్బులు ఇచ్చి ఆ పదవి కొనుక్కున్నాడని రేవంత్ పై చేసిన విమర్శ కాంగ్రెస్ పార్టీ లో కలకలం సృష్టించింది. అది మొదలు రేవంత్ రెడ్డిపై విరుచుకు పడడమే పనిగా పెట్టుకొని, ఎన్నికల వరకు రేవంత్ రెడ్డిపై విమర్శల పరంపర కొనసాగించాడు. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచినట్లుగా రేవంత్ రెడ్డి ఆయన చేసిన విమర్శలను పెద్దగా లెక్కచేయలేదు.



తెలంగాణ రాష్ట్ర సాధనే

ఊపిరిగా బతికిన

## జయశంకర్‌సార్

**ఆయన సేవలను ఎప్పటికీ వెలకట్టలేం: హరీశ్‌రావు**

హైదరాబాద్,తెలంగాణ దిశ: జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా, ఏకైక ఎజెండాగా బతికిన మహనీయుడు జయశంకర్ సార్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ఆయన తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన కృషి ఎప్పటికీ వెలకట్టలేమని పేర్కొన్నారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ ముద్దుబిడ్డ, సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఘన నివాళు లర్పించారు. భవిష్యత్ తరాలకు జయశంకర్ స్ఫూర్తిని అందించాలనే ఉద్దేశంతో వారి జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాల్లో మాజీ సీఎం కేసీఆర్ చేర్పించారని గుర్తుచేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ, భూపాలపల్లి జిల్లాలకు

# జిహెచ్ఎంసి నోటీసులకు విలువ లేదా..!?

## - 24 గంటల సమయం పూర్తి కాలేదా..!??
## - అద్దె సొమ్ములో ఎవరి వాటా ఎంతంత..?!




ఏఎస్ రావునగర్,ఆగస్టు 06, (తెలంగాణ దిశ) :కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్లు ఖాళీ చేయాలని గత నెల 4వ తేదీన జిహెచ్ఎంసి అధికారులు ఇచ్చిన నోటీసులకు విలువ లేదా అని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చి 30 రోజులు దాటిన తర్వాత జిహెచ్ఎంసి అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ ను సందర్శించి నిర్వాహకులను ఖాళీ చేయాలని కోరారని, కేవలం ఒక్క షట్టర్ కే తాళం వేసి వెళ్లిపోయా రని అన్నారు.



మిగిలిన 9 షెటర్లను ఎందుకు వదిలిపెట్టి పోయారని ప్రశ్నించారు. మిగిలిన వారికి 24 గంటల సమయం ఇచ్చా మని స్పష్టం చేశారని, కానీ 24 గంటల సమ యం పూర్తయిన అధికారులలో ఎలాంటి చల నం కనిపించడం లేదన్నారు. ఇందుకు కారణ మే మిటో అధికారులు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ లోని షట్టర్లను ఓపెన్ యాక్షన్ ద్వారా కేటాయించాలని కోరుతూ గత దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుతో కదిలిన జిహెచ్ఎంసి అధికారులు ఎట్టకేలకు నోటీసులు ఇచ్చారని అన్నారు. నోటీసుల సమయం పూర్తయినప్పటికీ 24 గంటలు సమయం ఎందు కిచ్చారో అర్థం కావడం లేదన్నారు. 24 గంటలు పూర్తయిన ఎందుకు సీజ్ చేయడం లేదో అందు పట్టడం లేదన్నారు. బుధవారం సాయంత్రం వరకు పది షటర్లలో ఒక్క దానికి తాళం వేసి సీజ్




చేయగా మరో మూడు మూసేసి ఉన్నాయని, ఇంకొక ఆరు షట్టర్లలో యధావిధిగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. అసలు వీటిపై జిహెచ్ఎంసి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వీటిపై వచ్చే నెలసరి ఆదాయం ఎవరెవరి జేబులోకి వెళ్తుందనే ప్రశ్న ఉత్పన్నమవు తుంద న్నారు. నిజంగా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతు న్నారని ఆయన ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న మర్మం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో అధికారులకు కూడా ఉన్న లాభమేమిటో స్పష్టం చేయాలన్నారు. ఖచ్చితంగా ఈ విషయాలు ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

# మల్లాపూర్ లో లార్వా నిల్వలపై రూ. 10 వేల ఫైన్




మల్లాపూర్, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) : మల్లాపూర్ లో బుధవారం ప్రధాన రహదారి పక్కన ఉన్న టైర్ల షాపులో టైర్లల్లోని వర్షపు నీటిలో లార్వా నిల్వలు పేరుకు పోవడాన్ని జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ అధికారులు గమనించారు. లార్వా నిల్వల వల్ల దోమలు ఉత్పత్తి అవుతాయని అవగాహన కల్పించారు.

టైర్లలోని లార్వాను తొలగించి, టైర్ షాప్ యజమానికి రూ. 10 వేల ఫైన్ వేశారు. డిసీ జగన్, ఎఎంహెచ్ఓ మధుసూదన్ రావు, ఎంటమాల జీ ఏఈ డి. రమేష్, సూపర్ వైజర్ కనకరాజు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలకు రెండు కంప్యూటర్ల బహుకరణ

## పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్య కోసం : కల్వ రమణ

వికారాబాద్, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) :తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల సందర్భంగా వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తోర్మామిడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కల్వ రమణ రెండు కంప్యూటర్లను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. కంప్యూటర్లు ఆన్ లైన్ విద్యా ద్వారా విద్యార్థులకు సాంకేతికత చేరువవుతుందన్నారు. సాంకేతికత యొక్క వేగవంతమైన పురోగతి నేపథ్యంలో విద్యార్థులకు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులను సూచిస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రెండు కంప్యూటర్లను



ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు కల్వ రమణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం. దేవ్యానాయక్, పాఠశాల సిబ్బంది ఉమామహేశ్వరి, రేష్మ, రాధ, ఇష్తేకర్ అలీ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ నేత అజీజ్ జన్మదిన వేడుకలు



ఏఎస్ రావునగర్, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) : కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ సీనియర్ నాయకులు అజీజ్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పుట్టినరోజు సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్,కాంగ్రెస్ నాయకులు పాకాల రాజు, అల్లూరయ్య, పెద్ది శ్రీనివాస్, మేఘ రాజు, రాధాకృష్ణ, సుంకు శ్రీకాంత్ రెడ్డి, లింగస్వామి, భద్ర గామా నరసింహ, మాణిక్ రెడ్డి, బాజీ భాష, సిహెచ్. బాల నరసింహ, ఎస్ఎన్ రావు, పీరా తదితరులు పాల్గొన్నారు.

# ఈసీఐఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ గా ప్రోటీక్ కుమార్ చక్రవర్తి

కుషాయిగూడ, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) :ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్) గా ప్రోటీక్ కుమార్ చక్రవర్తి నియమితులయ్యారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పిఈఎస్ బి) ఈ నియామకాన్ని సిఫార్సు చేసింది. సిఇఆర్సిలో చీఫ్ (ఫైనాన్స్) ఆఫీసర్ గా పని చేశారు. నిష్ణాతుడైన ఫైనాన్స్ ప్రొఫెషనల్ గా ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాతో పాటు ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా సభ్యుడు. అతను సెయింట్ నుండి వాణిజ్యంలో బ్యాచిలర్ డిగ్రీని కూడా చేశారు. ప్రోటీక్ కుమార్ చక్రవర్తి ప్రస్తుతం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) లో అదనపు జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) గా పనిచేస్తున్నారు. ఆయన ఈసీఐఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) గా బాధ్యతలు




చేపట్టడానికి ముందు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పిఈఎస్ బి) ద్వారా ఎంపికయ్యారు.

# ఘనంగా టిఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు జగదీశ్వర్ జన్మదిన వేడుకలు


హైదరాబాద్, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) : అనునిత్యం ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న స్టేట్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టిఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా టిఎన్జీఓ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా టిఎన్జీఓ నేతలు ఆయనకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షకార్యదర్శులు రవి ప్రకాష్, భరత్ కేంద్రసంఘం అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్వర్ - సయిద్ ముజీబ్ హుస్సేనీ లను ఘనంగా సన్మానించారు. టిఎన్జీఓ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కుషాయిగూడ కూరగాయల మార్కెట్ కు మహార్దశ


## - ఉప్పల్ ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు

కుషాయిగూడ, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) :కుషాయిగూడ పాత కూరగాయల మార్కెట్కు మంచి రోజులు రానున్నాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. శిథిలావస్థకు చేరిన మార్కెట్కు కొత్త రూపం ఇచ్చేందుకు రూ. 55 లక్షల నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. బుధవారం మార్కెట్ కమిటీ సభ్యులు సైనిక్ పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ కూరగాయల మార్కెట్ ను ఈ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. నిధులు మంజూరు చేయించిన లక్ష్మారెడ్డికి మార్కెట్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, మార్కెట్ అధ్యక్షులు వాకిటి శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, ఎం. రాజిరెడ్డి, బి. రవి తదితరులు పాల్గొన్నారు.

# యూపిఐ లావాదేవీలపై ఛార్జీలు




## ఎట్టకేలకు తప్పదంటూ ప్రకటించిన ఐసిఐసిఐ?

న్యూఢిల్లీ, : యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న వేళ ఇటీవల కేంద్రం సుంకాలు విధించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. కానీ ప్రభుత్వం దీనిని తోసిపుచ్చింది. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు- ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలని అన్నారు. ఇప్పుడు చిన్నిచిన్న దుకాణాలు మొదలు మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు- సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్లైన్, ఆఫ్లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు- నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు- ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

# త్యాగధనుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్

హైదరాబాద్, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) : .తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్ని ధారపోసిన త్యాగధనుడు, తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అనికాప్రా డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం కాప్రా తహసిల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశ ంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ఆశగా, శ్వాసగా యావజ్జీవతాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి స్వర్గీయ ఆచార్య జయశంకర్ అని కొనియాడారు.

ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం తెలంగాణ కోసం పాటుపడ్డారని అన్నారు. ఉద్యమ సిద్ధాంతకర్తగా తెలంగాణ సాధన కోసం ఆయన



చేసిన కృషి మరువలేనిదన్నారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రమేష్, సత్యనారాయణ, చక్రధర్, సాయిలు, జ్యోతి, అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ భావ జాల వ్యాప్తి కోసం జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్

నాగారం, ఆగస్టు 06, (తెలంగాణ దిశ) :తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భాస్కర్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం కమిషనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ చేసిన సేవలు అమూల్యమైనవని అన్నారు.

ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మున్సిపల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నా




మని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ సురేష్ రెడ్డి, రెవెన్యూ అధికారిగా బి. నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# కాషాయ గూటికి వెల్లంపల్లి!

విజయవాడ,తెలంగాణ దిశ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తప్పడం లేదు. ఆ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు గుడ్ బై చెప్పారు. కూటమి పార్టీల్లో చేరారు. మరోవైపు కూటమి ప్రభుత్వం కేసులతో వెంటాడుతోంది. దీంతో కొంతమంది నేతలు సైలెంట్ అయ్యారు. మరికొందరు సొంత వ్యాపారాల్లో నిమగ్నమయ్యారు. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే 12 మంది అరెస్టు అయ్యారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్టు జరిగింది. తదుపరి అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనిని ప్రచారం నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలా ఆందోళనతో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కొంతమంది పక్క చూపులు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. విజయవాడకు చెందిన ఓ మాజీ మంత్రి ఏకంగా బిజెపిలోకి వెళ్లేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పూర్వాశ్రమంలో స్నేహితులైన నేతల ద్వారా బిజెపిలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. అదే కానీ జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ దెబ్బ పడటం ఖాయం. మొన్నటి ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు వెల్లంపల్లి శ్రీనివాస్. కానీ ఆయన బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి చేతిలో ఓడిపోయారు. అయితే ఓటమి నాటి నుంచి ఆయనలో ఒక రకమైన మార్పు కనిపిస్తోంది. వైసిపి హయాంలో దూకుడుగా వ్యవహరించినందున కూటమికి తప్పకుండా టార్గెట్ అవుతానని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే బిజెపిలో చేరేందుకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు విజయవాడ పొలిటికల్ సర్కిల్లో ప్రచారం జరుగుతోంది. గతంలో బిజెపిలో పని చేసిన సమయంలో పివిఎన్ మాధవ్ మంచి స్నేహితుడు. ప్రస్తుతం ఏపీ బీజేపీ అధ్యక్షుడు కావడంతో.. వెల్లంపల్లి ఆయన ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాదులో ఇద్దరి చర్చలు పూర్తయ్యాయని.. వెల్లంపల్లి బిజెపిలోకి వెళ్లడం ఖాయమని పొలిటికల్ సర్కిల్లో ప్రచారం అయితే మాత్రం జరుగుతోంది. ప్రజారాజ్యం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు వెల్లంపల్లి శ్రీనివాస్. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం బిజెపిలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా మరోసారి పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. కానీ ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. 2016లో వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.

# సంపాదకీయం

## ధర్మస్థలలో ధర్మం లేదా?

ధర్మస్థల. ఇదొక కర్ణాటక తిరుమల. కొండల్లో వెలసిన ఈ మంజునాథ స్వామి ఆలయానికి విశేషమైన చరిత్ర. అలాంటి చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంలో వరుస హత్యలు. అందునా మహిళలు, యువతులు, మైనర్ బాలికలున్నారా? ఒక సఫాయి కార్మికుడు చెబుతున్న సాక్ష్యం ద్వారా అసలేం జరుగుతోంది? ఈ మొత్తం ఉదంతం ద్వారా వెలుగులోకి వస్తోన్న కఠిన వాస్తవాలేంటి? 1995- 2014 మధ్య కాలంలో.. తాను తన చేతుల మీదుగా కొన్ని వందలాది శవాలను నేత్రావతీ పరిసర ప్రాంతాల్లో ఖననం చేశానని అంటాడు. ఈ పక్కనే ఉన్న అడవుల్లో కొన్ని మృతదేహాలను దహనం కూడా చేశాననీ చెప్పుకొచ్చాడు. మరి కొన్ని మృతదేహాలను తాను నదిలో పాడేశానని అనడం విన్న పోలీసులకు మొదట అర్ధం కాలేదు. బెళ్తంగడి న్యాయస్థానంలో కూడా వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో ఒక్కసారిగా ఈ వార్త రాష్ట్ర వ్యాప్త సంచలనంగా మారింది. సీఎంని కలిసిన సుప్రీం రిటైర్డ్ జడ్జ్. ఇతడిచ్చిన వాంగ్మూలంతో ఒక యూట్యూబర్ వీడియో రూపొందించడంతో.. అది అర మిలియన్ వ్యూస్ పోయింది. దీనిపైనా కేసు బుక్ అయ్యింది. ఆ సరికే అది జనబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్లడంతో.. ఈ కేసు, దాని వివరాలు తీవ్ర ప్రకంపనలు నమోదు చేయడం మొదలైంది. అదెలాగంటే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాల గౌడ సీఎం సిద్ధరామయ్యను కలసి.. ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరారు. ఇందులో మహిళలు, యువతులు, మైనర్ బాలికలు సైతం ఉండటం గుర్తించిన కర్ణాటక మహిళా కమిషన్ సైతం ప్రభుత్వాన్ని దర్యాప్తు పై ఒత్తిడి చేసింది. ఆలయ ధర్మకర్తలు జైన్లు, శివుడికి వైష్ణవ పూజలు జరిగే ధర్మస్తల. ఈ మాజీ సఫాయి కార్మికుడు చెప్పినదంతా ఎలా నమ్మాలి? కొన్నేళ్ల తరబడి ఎంతో నిష్టాగరిష్టతలతో తులతూగుతున్న ఆలయ ప్రాంతానికి ఇంతటి అప్రదిష్ట మూటగట్టడమా? దానికి తోడు ఈ ఆలయ ప్రాంతం పేరే దర్మస్థల. ఇక్కడ ధర్మ దేవత ధర్మాన్ని నాలుగు పాదాలా నడిపిస్తుందని అంటారు. ఇదొక ఆధ్యాత్మిక త్రివేణీ సంగమం. ఆంధ్రకు వెంకటేశ్వరస్వామి వారు ఎలాగో కర్ణాటకలో మంజునాథ స్వామి వారు అలాగ. ఇక్కడ వంశపారంపర్య ధర్మకర్తగా ఎంపీ వీరేంద్ర హెగ్డే ఉన్నారు. ఈయన ఇక్కడ దాదాపు ఒక సమాంతర న్యాయ వ్యవస్థను నడుపుతారు. ఈ ఆలయం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్య, వైద్య సేవలు విశేషంగా అందుతాయి. కుటుంబ- వ్యాపార- ఇతర సమస్యలేవైనా వస్తే ఈ ప్రాంతానికే తలపెద్దగా భావించే హెగ్డే దగ్గరకొచ్చి తమ సమస్యలు పరిష్కరించుకుంటారు. ఎన్నో జంటలకు ఎంపీ వీరేంద్ర హెగ్డే ఇచ్చే తాళిబొట్టుతో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ఇక్కడ ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందనడానికి ఎన్నెన్నో ఉదాహరణలు. అలాంటి ధర్మస్థల లో వందలాది హత్యలు జరిగాయని తెలియడంతో ప్రపంచమంతా షాకైంది. కంప్లయింట్ చేసిన తల్లిని బెదిరించి పంపిన పోలీసులు. ఇంతకీ ఇతడు చెప్పేదేంటని చూస్తే తన చేజేతులా.. ఎన్నో శవాలకు ఖననం, దహనం నిర్వహించానని అంటాడాయన. అంతే కాదు తనకు ఇష్టం లేకపోయినా ఎందరో మహిళలు, యువతులు, మైనర్లు మృతదేహాలను ఖననం చేశానని చెప్పుకొచ్చారు. 2010లో తానిలాగే ఒక స్కూల్ డ్రెస్ వేసుకున్న మైనర్ బాలిక మృతదేహాన్ని ఖననం చేశానని అంటాడీ మాజీ పారిశుధ్య కార్మికుడు. అంతే కాదు 2003లో అనన్య భట్ అనే ఒక ఎంబీబీఎస్ స్టూడెంట్ తన స్నేహితులతో కలసి ధర్మస్తలకు వచ్చి.. ఆపై కనిపించకుండా పోయింది. ఆ సమయంలో మృతురాలి తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమెను బెదిరించి పంపారని అంటారు. ఇక 2012లో సౌజన్య అనే మరో యువతి హత్యాచారం కేసు పై కూడా కొంత కాలంగా వివాదం చెలరేగుతోంది. తనకు ప్రాణ హాని ఉందంటోన్న మాజీ పారిశుధ్య కార్మికుడు. ఇంతకీ ఈ సఫాయి కార్మికుడు ఇక్కడి నుంచి ఎందుకెళ్లాడు? ఆ వివరాలేంటని చూస్తే.. 2014లో తన కుటుంబానికి చెందిన మైనర్ బాలికను సైతం ఇలాగే లైంగికంగా వేధించారు. దీంతో తనకు విరక్తి వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోయానని అంటాడాయన. తనలోని పాపభీతి ఇన్నాళ్లకు నిజం బయటకొచ్చేలా చేసిందని.. తాను గత కొంత కాలంగా అపరాధభావంతో కుమిలిపోతున్నట్టు చెప్పుకొచ్చారీ మాజీ పారిశుధ్య కార్మికుడు. తానీ పని చేస్తున్నప్పటి నుంచి తప్పుగానే భావించాననీ.. అయితే బలవంతానా తన చేత ఈ దుర్మార్గపు పని చేయించారనీ.. లేదంటే చంపేస్తామంటూ బెదిరించేవారని చెబుతాడీ మాజీ సఫాయి కార్మికుడు. తనకు ప్రాణహాని ఉందని కూడా చెబుతాడితను.. ఇక్కడి వంశపారంపర్య పాలనా పరంపర అలాంటిది. అందుకే ఈ ఆలయ ధర్మకర్త వీరేంద్ర హెగ్డేకి రాజ్యసభ్యత్వం ఇచ్చి గౌరవించింది కేంద్ర ప్రభుత్వం. ఆయన ఇది వరకే పద్మ పురస్కారాలతో పాటు ఇంకా ఎన్నో విశేష పురస్కారాలు అందుకున్నారు. ధర్మస్తల అంటే ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతటి అశేష సామాజిక ప్రాధాన్యత ఉంది. కార్యమేదైనా హెగ్గే అనుమతి తీస్కునే స్థానికులు. వీరేంద్ర హెగ్డే వీరికొక ధర్మాధికారి మాత్రమే కాదు. అంతకన్నా మించి. ఆయనకు పరోపకారి అన్నదొక బిరుదు. ఈ ప్రాంత కీర్తి ప్రతిష్టల పతాక.. హెగ్డే కుటుంబం. ఈ ఆలయ చరిత్రతో ఈ జైన కుటుంబ చరిత్ర అంతగా మమేమకమై కనిపిస్తుంది. వీరేంద్ర హెగ్డే కుటుంబం తరతరాలుగా ఇక్కడి స్థానికుల నుంచి నీరాజనాలు అందుకుంటోంది. ఈ ప్రాంత వాసుల ఇంట్లో ఏ శుభకార్యం జరగాలన్నా ఆ మంజునాథుడే తమకు ఆనతిచ్చినట్టుగా హెగ్డే దగ్గరకు వచ్చి అనుమతి తీసుకుని వెళ్తారు. అంతగా ఇక్కడి ఆచార వ్యవహారాలు నడుస్తాయి. వారికేదైనా వివాదం వచ్చినా తీర్చుకోడానికి ఇక్కడికే వస్తుంటారు. గతంలో గ్రామ పెద్దలు, ఊరి పెద్దల పంచాయితీలు- తీర్పులు ఎలా సాగేవో.. ఇప్పటికీ ఇక్కడ అలాగే కొనసాగుతుంటాయి. ధర్మస్థల ఉదంతానికి సంబంధించి 8,842 పోస్టులు. వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ధర్మస్తల ఉదంతానికి సంబంధించిన 8, 842 లింకులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. గతంలో తమ దగ్గర పని చేసినపారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఫుటేజీ పూర్తిగా తొలగించాలని, వీటిని డీ- ఇండెక్స్ చేయాలని కోరారు హర్షేంద్ర. అంతే కాదు.. తన పిటిషన్లో ఆయన ఎక్స్, ఫేస్ బుక్, థ్రెడ్ వంటి ప్లాట్ ఫామ్స్ పై పోస్టుల గురించి కూడా ప్రస్తావించారు. ఈ వివాదంపై పలు యూట్యూబ్ చానెళ్లు, సోషల్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాలో ప్రచురించడం, ప్రసారం చేయడం, ఫార్వర్డ్ చేయడం అప్ లోడ్ చేయడాన్ని నిషేధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మస్థల మిస్టరీ మరణాల వివాదం అయితే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వైరల్. కారణమేంటంటే ధర్మస్తల ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే ఒక రాజ్యసభ ఎంపీ. ఇంతటి ప్రశాంత వాతావరణంలోని ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి మారణకాండ జరగటమేంటి? ఇంతకాలం ఇదెలా గుట్టుగా ఉంది? ఎవరికీ అనుమానం రాలేదు ఎందుకని? నదిలోనూ కొన్ని మృతదేహాలు పడేశానని ఆ పారిశుధ్య కార్మికుడు చెబుతుంటే.. మరి అప్పుడే ఆ మృతదేహాలు ఎక్కడో ఒక చోట తేలి.. కనిపించేవి కదా? ఒకటి రెండు తప్ప .. మరే కేసు కూడా ఇప్పటి వరకూ ఎందుకు వెలుగులోకి రాలేదన్నది షాకింగా ఉంది. ఇటు ప్రభుత్వమే కాదు అటు, హెగ్డే కుటుంబం కూడా దీన్నించి ఎలా బయట పడాలో అర్థంకాక సతమతమవుతోంది. మరి చూడాలి...

# అభద్రత..!



సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కోటి ఆశలతో ఆ రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని స్థితి నెలకొంటోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు కొద్దిరోజుల క్రితం చేసిన ప్రకటన ఈ పరిస్థితికి తాజా నిదర్శనం. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట! ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు! దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది.

వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం.

భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను ఆ సంస్థ చెబుతోంది. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెకీ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఏమైనప్పటికీ, సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంస్థలు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. అనధికారికంగా పనిగంటలు పెంచడం, పని ఇవ్వకుండా బెంచ్‌పై ఉంచి బెదిరింపులకు పాల్పడటం వంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అభద్రతా భావం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చోటుచేసుకుంటోంది. మరోవైపు ఈ రంగంలో తగ్గుతున్న ఉద్యోగాల ప్రభావం హైదరాబాద్, బెంగళూరు వంటి చోట్ల అనుబంధ రంగాలపై కూడా పడుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కంపెనీల లాభనష్టాల లెక్కలు ఎలా ఉన్నప్పటికీ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణకు అవసరమైన నైపుణ్యాల పెంపు బాధ్యతను సంస్థలే స్వీకరించాలి. ఆ సాకుతో ఉద్యోగాలను తొలగించడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ బతుకులలో పెరుగుతున్న సంక్షోభంపై గళం విప్పాలి!

# ఆపరేషన్ మహాదేవ్ పేరే ఎందుకు..?

శ్రీనగర్, : పచ్చగా ఉన్న జమ్ము కాశ్మీర్లో కొద్ది నెలల క్రితం పహాల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా కాల్పులు చేపట్టి మన దేశ పౌరులను చంపేశారు. శ్వేతసౌదంలాగా వెలిగిపోతున్న కాశ్మీర్ రాష్ట్రంలో నెత్తుటి ఏర్లను పారించారు. ఈ ఘటన ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులు మొత్తం పాకిస్తాన్ ప్రేరేపిత ముష్కర మూకలని భారత ప్రభుత్వానికి ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద తాండాలను నేలమట్టం చేసింది. అయినప్పటికీ పహల్గాం దాడుల్లో పాల్గొన్నవారు సేఫ్ గా ఉండడం భారత భద్రతా దళాలకు ఏమాత్రం సంతృప్తి ఇవ్వలేదు.అప్పటినుంచి అదును కోసం ఎదురుచూస్తున్న భారత భద్రతా దళాలు ఆపరేషన్ చేపట్టాయి. పహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. ఈ ఆపరేషన్ కు భారత భద్రత దళాలు మహదేవ్ అని పేరు పెట్టాయి. భద్రతా దళాలు చేసిన దాడిలో పహాల్గాం ఘటనకు సూత్రధారి, లష్కరే తోయిబా కమాండర్ హాసీం ముసా, మరో ఇద్దరు ఉగ్రవాదులు ఈ ఘటనలో కన్నుమూశారు.. ఆపరేషన్ మహాదేవ్ లో చీనార్ కార్ప్స్, 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా స్పెషల్ ఫోర్సెస్ పాల్గొన్నాయి. గడచిన రెండు వారాలుగా ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు గాలింపు చేపట్టాయి. దాచిగాం నేషనల్ పార్క్ పరిసర ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు మన భద్రత దళాలకు తెలిసింది. అక్కడ ఉన్న సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు అడవిలో దట్టమైన చెట్ల కింద తవ్విన ఒక గుహలో తలదాచుకున్నట్టు సమాచారం. పక్కా సమాచారంతో భద్రతా దళాలు వారిని చుట్టుముట్టి.. ఒక్కసారిగా మట్టు పెట్టాయి.. ఈ దాడిలో లష్కరేతోయిబా, జై షే మహమ్మద్ ఉగ్రవాద గ్రూప్లకు చెందిన ఏడు మంది ముష్కరులను భద్రతా దళాలు అంతం చేశాయి. అయితే ఆపరేషన్ మహదేవ్ ఆగిపోలేదని.. ఇంకా కొనసాగుతూనే ఉంటుందని భద్రతా దళాలు చెబుతున్నాయి.దాచిగాం సమీపంలో మహదేవ్ అనే పర్వతం ఉంటుంది. అందువల్లే ఈ ఆపరేషన్ కు మహదేవ్ అని పేరు పెట్టారు. ఇక ఎన్కౌంటర్ జరిగిన ప్రాంతం జబర్వన్, మహదేవ్ పర్వతాల మధ్య ఉంది. అందువల్లే ఈ ఆపరేషన్ కు ఆ పేరు పెట్టారు. ఇక్కడ మహదేవ్ పర్వతంలో శివుడు నడయాడాడని.. అందువల్లే ఈ పర్వతం మహిమాన్వితమైనదని స్థానికులు చెబుతుంటారు. ఇక్కడి దట్టమైన అడవిలో శివుడు తపస్సు చేశాడని.. దానికి సంబంధించిన ఆడవాళ్లు కూడా ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటారు.

టెర్రరిస్టులను పట్టించిన చైనా ఫోన్: టెర్రరిస్టులను పట్టించిన ౧-82 అల్ట్రాసెట్ శాటిలైట్ ఫోన్‌లు మనదేశం దశాబ్దమున్నర కిందటే నిషేధించింది. 2020 గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత చైనీస్ టెలికాం సంస్థలైన హువాయ్, జిఇ ఉత్పత్తులపై నిషేధం విధించింది. భారత వైర్‌లెస్ టెలిగ్రఫీ యాక్ట్, 1933 సెక్షన్ 6, ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ సెక్షన్ 20 ప్రకారం అమలులోకి వచ్చింది. ఎందుకంటే ఈ ఫోన్‌లు చైనాకు చెందిన టియాంటాంగ్-1 శాటిలైట్ నెట్‌వర్క్‌తో రహస్య కమ్యూనికేషన్‌కోసం అనుసంధానం చేయబడ్డాయి. ౧-82 ఫోన్‌లు సాధారణ స్మార్ట్‌ఫోన్‌ల లాగా కనిపిస్తాయి. అంతర్గత శాటిలైట్ యాంటెన్నాలు వీటిని గుర్తించలేవు . బైసరన్ లోయలో మూడు శాటిలైట్ ఫోన్ సిగ్నల్‌లు గుర్తించబడ్డాయి. పెహల్గామ్ దాడికి ముందు రెక్కీ కోసం చైనా శాటిలైట్ ఫోన్‌లనే ఉగ్రవాదులు యూజ్ చేశారు

# ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

**పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు**

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్ర మైన ఓదెల మల్లన్నఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పెద్దపల్లి శాసనసభ్య చింత కుంట విజయర మణా రావు అన్నారు. ఓదెల మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి నూతనపాలకవర్గాన్ని నియమించింది. పాలకవర్గ సభ్యులను ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించిన తదుపరిపాలకవర్గం సభ్యులను అభినందిస్తూ శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాకు ప్రసిద్ధి చెందిన ఓదెల మల్లన్న ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు.ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. పాలకవర్గ సభ్యులు సేవా భా వంతో పనిచేస్తూ ఆధ్యాత్మికత ను పెంపొందించేందుకుపాటుపడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు ఓదెల, సుల్తానాబాద్ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ లీడర్లు, కార్యకర్తలు, జిల్లా పద్మశాలి సేవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ



**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ:** జిల్లా కేంద్రం జయశంకర్ భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 5,9,10,15 వార్డులైన ఆకు దారివాడ, బాంబులగడ్డ, సీఆర్ నగర్, క్రిష్ణకాలనీ, మహబూబ్ పల్లి, కుందూరుపల్లి, పుల్లూరిరామయ్య పల్లి, కాకతీయకాలనీ లకు చెందిన మొత్తం 94 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ లోకీలాల్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఇతర అధికారులు కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంజూరీ పత్రాలను లబ్ధిదారులకు పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పుడు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే చెప్పారు. అదేవిధంగా, రాష్టాన్ని గత పదేళ్లు పాలించినోళ్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోగా, పేదలను నిరుపేదలుగా మార్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వంకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆరోపించారు. పేదలకు కూడా సన్నబియ్యం అందించాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడాలేని విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కాని, ఒక్క కిలో సన్న బియ్యం కాని ఇవ్వలేదన్నారు. ఈరోజుతో భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 3500 ఇళ్లకు మంజూరీ పత్రాలను ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు.

# తలసరి ఆదాయంలో కర్ణాటక టాప్



బెంగళూరు : భారతదేశంలో ఇప్పుడు తలసరి ఆదాయం ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వం లెక్కలు వెల్లడించింది. అలాగే, గత పదేళ్లలో మన దేశంలో ప్రజల సగటు ఆదాయం ఎంత పెరిగిందో కూడా తెలిపింది. అయితే, ఈ పెరుగుదల అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేదు. కొన్ని రాష్ట్రాలు బాగా ముందున్నాయి.. మరికొన్ని వెనుకబడ్డాయి. అసలు తలసరి ఆదాయం అంటే ఏంటి? ఏ రాష్ట్రం ఎంత ముందుందో వివరంగా తెలుసుకుందాం. భారతదేశ సగటు తలసరి ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,14,710కి చేరింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఈ విషయాన్ని ప్రకటించారు. పదేళ్ల క్రితం అంటే 2014-15లో ఇది రూ.72,805 మాత్రమే. అంటే పదేళ్లలో రూ.41,905 పెరిగింది. అయితే, అన్ని రాష్ట్రాల్లో ఈ ఆదాయం ఒకేలా పెరగలేదు. ఆర్థికాభివృద్ధిలో తేడాలు, వివిధ రంగాల పనితీరు, ప్రభుత్వ విధానాల వల్ల ఈ మార్పులు ఉన్నాయని పంకజ్ చౌదరి వివరించారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ ఇచ్చిన లెక్కల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి తలసరి ఆదాయంలో కర్ణాటక ముందుంది. కర్ణాటకలో తలసరి ఆదాయం రూ.2,04,605. ఆ తర్వాత తమిళనాడు రూ.1,96,309తో రెండో స్థానంలో నిలిచింది.

తలసరి ఆదాయంలో ముందున్న టాప్ 10 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు వరుసగా కర్ణాటక రూ.2,04,605, తమిళనాడు రూ.1,96,309, హర్యానా రూ.1,94,285, తెలంగాణ రూ.1,87,912, మహారాష్ట్ర రూ. 1,76,678, హిమాచల్ ప్రదేశ్ రూ.1,63,465, ఉత్తరాఖండ్ రూ.1,58,819,

పుదుచ్చేరి రూ.1,55,533, ఆంధ్రప్రదేశ్ రూ.1,41,609, పంజాబ్ రూ.1,35,356లుగా ఉన్నాయి.తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ భారతదేశంలో తమిళనాడు రెండో అత్యధిక తలసరి ఆదాయాన్ని సాధించిందని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంలో పరిశ్రమలు,

విద్య రంగాల్లో వచ్చిన అభివృద్ధి వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. డీఎంకే ప్రభుత్వం వచ్చిన తర్వాత 2020-21లో రూ.1.43 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం 2024-25 నాటికి రూ.1.96 లక్షలకు పెరిగిందని ఆయన వివరించారు.

తమిళనాడు సగటు వృద్ధి రేటు గత నాలుగు సంవత్సరాల్లో 8.15శాతం ఉంది. ఇది అంతకు ముందు ఉన్న 4.42శాతం కంటే దాదాపు రెట్టింపు అని అన్నారు.తలసరి ఆదాయంలో తెలంగాణ నాలుగో స్థానానికి పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు టాప్ 3లో నిలిచిన తెలంగాణ, ఇప్పుడు హర్యానా కంటే వెనుకబడి, కర్ణాటక, తమిళనాడుల కంటే గణనీయంగా వెనుకబడింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన రాజకీయ మార్పులు, ఆర్థిక విధానాలు, వివిధ రంగాల పనితీరు ఈ ర్యాంకింగ్‌పై ప్రభావం చూపించి ఉండవచ్చని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ తగ్గుదలకు గల కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి, తలసరి ఆదాయాన్ని తిరిగి పెంచేందుకు కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.


# డోన్ట్ వేస్ట్ గోల్డెన్ అవర్



**'గోల్డెన్ అవర్'.. వైద్యపరిభాషలో ఈ పదానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఇది మనుషుల ప్రాణాలతో ముడిపడిన విలువైన సమయం. ఎవరైనా ఒక వ్యక్తి ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు, గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ లాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు ఒక నిర్ణీత సమయంలో సదరు రోగులను దవాఖానకు తరలించి, సరైన చికిత్స అందించే సమయాన్నే వైద్య పరిభాషలో గోల్డన్ అవర్‌గా పరిగణిస్తారు. రోగి కార్డియాక్ అరెస్ట్ లాంటి సమస్యలకు గురై, జీవన్మరణంతో పోరాటం చేస్తున్న సమయంలో ప్రతి సెకనూ అత్యంత విలువైనదే! బాధితులకు అవి నిజంగానే అమృత ఘడియలు అని చెప్పవచ్చు. అసలు ఈ గోల్డెన్ అవర్ అని ఏ సమయాన్ని అంటారు?, ఎలాంటి అనారోగ్య సమస్యలకు లేదా ప్రమాదాలకు ఈ గోల్డెన్ అవర్ వర్తిస్తుంది? ఈ గోల్డెన్ అవర్‌లో ఎలాంటి రోగాలు, ఎలాంటి ప్రమాదాలకు గురైన బాధితులకు చికిత్స అందించవచ్చు? ఏయే చికిత్సలు చేయవచ్చు? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

'జీవితం.. క్షణ భంగురం' అంటారు పెద్దలు. అవును, ఏదైనా ఆపద తలెత్తినప్పుడు ఆ ఒక్క క్షణమే మనిషి ప్రాణాలను నిలబెడుతుంది. ఆ ఒక్క క్షణం ఆలస్యంతోనే%లా% మనిషి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. 'కాస్త ముందుగా తెచ్చి ఉంటే బతికించేవాళ్లం' అని వైద్యులు చెప్పే సన్నివేశాలు ఎన్నో సినిమాల్లో మనం చూశాం. కాలం ఎంత విలువైనదో ఇలాంటి సందర్భాల్లోనే తెలుస్తుంది. అందుకే గోల్డెన్ అవర్‌లో ఒక్క క్షణం కూడా వృథా చేయకూడదు. సత్వర చికిత్స అందించగలిగితే ఒక మనిషి ప్రాణాన్నే కాదు.. ఆ వ్యక్తి కుటుంబాన్ని కాపాడినట్టు అవుతుంది.

సాధారణంగా ధమనిలో ఏర్పడిన అవరోధం కారణంగా గుండె భాగానికి రక్తం ద్వారా ఆక్సిజన్ సరఫరా కానప్పుడు గుండెపోటు సంభవిస్తుంది. ఈ సమయంలో గుండె కొట్టుకుంటుంది కానీ, దాని పనితీరు మందగిస్తుంది. సకాలంలో చికిత్స అందించకపోతే శాశ్వతంగా గుండె కండరాలు దెబ్బతిని పంపింగ్ తగ్గిపోతుంది. దీని వల్ల రక్తపోటు పడిపోయి షాక్‌లోకి వెళ్లి రోగి మృతి చెందే ప్రమాదం ఉంటుంది. అందుకని గుండెపోటు వచ్చిన తొలి గంటలోపు అంటే గోల్డన్ అవర్‌లో సరైన చికిత్స అందించాలి.



కార్డియాక్ అరెస్ట్: గుండెపోటు వచ్చిన తొలి 60 నిమిషాల్లో కార్డియాక్ అరెస్ట్ సంభవించే ప్రమాదం ఎక్కువ. గుండెకు సంబంధించిన విద్యుత్ వ్యవస్థ విఫలమైనప్పుడు కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. దీనివల్ల గుండె పంపింగ్ పూర్తిగా ఆగిపోతుంది. రోగి కుప్పకూలిపోతాడు. శ్వాస ఆగిపోయి, పల్స్ పడిపోతుంది. శరీరానికి రక్తసరఫరా నిలిచిపో యి 10 నిమిషాల్లో బ్రెయిన్ డెడ్ అవుతుంది. ఇది తీవ్రమైన అత్యవస ర సమయం. వెనువెంటనే చికిత్స అందించకపోతే నిమిషాల్లోనే మనిషి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకని కార్డియాక్ అరెస్ట్‌లో గోల్డెన్ సెకన్లలోనే (అతి శీఘ్రంగా) చికిత్స అవసరం.

అవే అమృత ఘడియలు: ఏదైన ప్రమాదం జరిగినప్పటి నుంచి గంటలోపు సమయాన్ని గోల్డన్ అవర్ అంటారు. ఎందుకంటే రోగి ప్రమాదానికి గురైన వెంటనే గుండె, మెదడు వంటి ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. సెంటర్స్ ఫర్ డిసీజస్ కంట్రోల్ (సీడీసీ) ప్రకారం హఠాత్తుగా జరిగే కార్డియాక్ అరెస్ట్ మరణాలలో సగం మరణాలు దవాఖానకు చేరుకునేలోపే జరుగుతున్నాయి. పలు వైద్య అధ్యయనాల ప్రకారం ఆక్సిజన్ అందనప్పుడు గుండె కండరాలు 80 నుంచి 90 నిమిషాల్లోనే చనిపోతుంటాయి. ఇక ఆరు గంటల తరువాత రోగి కోలుకోలేని విధంగా పరిస్థితి విషమిస్తుంది.

ఈ సందర్భాలలో కీలకం: రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, గుండెపోటు లేదా ఛాతీలో నొప్పి, బ్రెయిన్ స్ట్రోక్, ఈ సేవలు అతి ముఖ్యం.. గుండెపోటు వచ్చినప్పటి నుంచి గంట వ్యవధిలోపు సరైన వైద్యం అందించడం ఎంతో కీలకం. ముఖ్యంగా గుండెకు రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించి, శాశ్వత నష్టాన్ని నిరోధించే ప్రైమరీ యాంజియోప్లాస్టి వంటి విధానాలు రోగిని రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇక కార్డియాక్ అరెస్ట్‌లో గోల్డెన్ సెకన్‌లోనే స్పందించాల్సి ఉంటుంది. అంటే కార్డియాక్ అరెస్ట్ అయిన వెంటనే సీపీఆర్ లాంటివి చేయాల్సి ఉంటుంది.

సీపీఆర్ కీలక పాత్ర: కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వారిలో సీపీఆర్ కీలక పాత్ర పోషిస్తుంది. కార్డియాక్ అరెస్ట్‌తో కుప్పకూలినప్పుడు సీపీఆర్ చేయకపోవడం వల్ల ప్రతి నిమిషానికి 10 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. అందుకని ఇలాంటి సందర్భాల్లో రోగికి వెంటనే అంటే నిమిషాల్లోపు సీపీఆర్ చేయాలి.

దీని వల్ల బాధితుడి ప్రాణాలను కాపాడవచ్చు. సీపీఆర్ అంటే ఛాతీ మధ్యలో గట్టిగా, వేగంగా నొకడం లాంటివి చేయాలి. ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్ (ఏఈడీ) అందుబాటులో ఉంటే, ఆలస్యం చేయకుం డా ఉపయోగించాలి. రోడ్డు ప్రమాదా లు, అగ్ని ప్రమాదాలు, స్ట్రోక్స్, ఇతర క్లిష్టమైన అనారోగ్యాలను నిర్వహించడంలో కీలకమని గుర్తుంచుకోవాలి.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ప్రవేశాలు

### – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** ప్రస్తుత విద్యా సంవత్సరానికి హైదరాబాద్ లోని బేగంపేట, రామంతా పూర్ పబ్లిక్ స్కూల్ లలో 1వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశంకొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల8లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థిని, విద్యార్థుల కు 2 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థి 2018 జూన్ 1 నుండి 2019 మే 31 మధ్యలో జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేల లోపు ఉండాలని, ధృవీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను గెజిటెడ్ అధికారిచే అటేస్టడ్ చేయించి సాయంత్రం 5 గంటలలోగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. 10 న లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుందని, మరిన్ని వివరాలకు పెద్దపెల్లి కలెక్టరేట్ లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయం లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.


## గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం..!

**అశ్వారావుపేట,తెలంగాణ దిశ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపుతుంది. రాత్రంతా ప్రశాంతంగా ఉన్న గ్రామంలో తెల్లారేసరికి మూడు రోడ్ల కూడలి మధ్యలో క్షుద్ర పూజలు చేసిన వస్తువులు ప్రత్యక్షమయ్యాయి. వాటిని గమనించిన స్థానికులు హడలిపోతున్నారు. నాగ పంచమి రోజున అతీత శక్తుల కోసం క్షుద్ర పూజలు చేసి ఉంటారని కొంతమంది భావిస్తుంటే, ఎవరి మీద అయినా కక్షతోనో లేక ఆధిపత్యం కోసమో ఈ పూజలు జరిగి ఉండొచ్చని మరికొందరు అనుకుంటున్నారు.

ఎటువైపు నుంచిఎవరికి ముప్పు వస్తుందో అని మూఢ నమ్మకాలు ఉన్నవారు భయపడుతుంటే కొందరు యువకులు మూడు రోడ్ల కూడలిలో పెట్టి ఉంచిన క్షుద్ర పూజల వస్తువులను తగలబెట్టేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. అధికారులు ఇలాంటి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించే కళాజాత కార్యక్రమాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో చైతన్యం కలిగించి ఇలాంటి మూఢనమ్మకాల క్షుద్ర పూజలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# కేబినెట్ షఫ్లింగ్ పై ఆశలు

## రెడ్డమ్మకు అవకాశం...




**కడప,తెలంగాణ దిశ:** కూటమి ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ. ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట. క్యాబినెట్ షఫ్లింగ్ ఎప్పుడో..ఎంతమందిని తప్పించి..మరెంతమంది కొత్తవారిని తీసుకుంటారో తెలియదు కానీ..మంత్రివర్గ విస్తరణ జరిగితే తమకు బెర్త్ పక్కా అంటూ ఊహల్లో తెలియాడుతున్నారు ఆశావహులు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇద్దరి పేర్లు క్యాబినెట్ రేసులో సౌండ్ రీసౌండ్ చేస్తున్నాయ్. మొదటి ప్రయత్నంలోనే గెలిచి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా పేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఒకరు అయితే..మరొకరేవెూ పార్టీకి వీర విధేయుడు పుట్టా సుధాకర్‌యాదవ్.చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప అంటే విడిపోయిన నాలుగు జిల్లాలు ఉమ్మడి రెండు జిల్లాలకు కలిపి కొత్తగా ఎమ్మెల్యే అయిన రాయచోటి శాసనసభ్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మొదటి విడతలో మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నాలుగు జిల్లాలకు కలిపి ఒకరే మంత్రిగా ఉండటాన్ని కొంతమంది పెద్దలు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లడంతో విస్తరణలో మరొకరికి అవకాశం ఇస్తామన్నారని టాక్. దీంతో ఉమ్మడి కడప జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేరు మంత్రివర్గ విస్తరణలో ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన పుట్టా..మైదుకూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయ్.

శ్రీవారి సేవతో పాటు సమాజసేవ చేసి చంద్రబాబుకు నమ్మినబంటుల ఉంటున్నారు. పైగా ఉమ్మడి కడప జిల్లాలో ఒకే ఒక బీసీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్. ఆర్థికంగా, సామాజికంగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తి కావడం పుట్టా సుధాకర్ యాదవ్‌కు కలిసి వచ్చే అంశాలు.ఇక మొదటి ప్రయత్నంలోనే కడప ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచి హిస్టరీ క్రియేట్ చేశారు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి. మైనార్టీల కంచుకోటైన కడపలో గెలిచి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ పదవిని కూడా దక్కించుకున్నారు. కడప నగరంలో ఓవైపు అభివృద్ధిపై ఫోకస్ పెట్టడంతో పాటు..ప్రత్యర్థి వైసీపీతో ఢీ అంటే ఢీ అంటుండటం మాధవిరెడ్డికి కలిసొచ్చే అంశాలు. ఆమె ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే కావడం..జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, మిగతా నేతల్లో సీనియర్లు ఎక్కువ. ఇది మాధవి రెడ్డికి కాస్త ఇబ్బందిగా మారొచ్చు. అయినా మంత్రి పదవి రేసులో కడప శివంగిగా పిలవబడే మాధవి రెడ్డి పేరుకూడా బలంగా వినిపిస్తోంది.మాధవిరెడ్డి భర్త కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికంగా బలవంతుడు కావడంతో పాటు నేరుగా చంద్రబాబు లోకేశ్‌తో టచ్‌లో ఉంటూ పొలిట్ బ్యూరో వ్యవహారాలు చక్కబెడుతుంటారు. మంత్రి పదవి వస్తే జిల్లాపై పట్టు పెంచుకోవడానికి అవకాశం ఉంటుందనే భావనతో భార్యకు మంత్రి పదవి తెచ్చుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారట.కడప మహానాడు వేదికగా శ్రీనివాస్‌రెడ్డి భావోద్వేగం భార్యకు మంత్రి పదవి కోసమే అంటూ లోకల్ పార్టీలో టాక్.ప్రభుత్వ ఏర్పాటు అప్పుడే మాధవిరెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కుతుందని అనుకున్నారు. అప్పుడు కుదరలేదు. మహానాడు వేదికగా ఏకంగా సీఎం చంద్రబాబు మాధవిరెడ్డిని పొగడటంతో ఆమెకు బెర్త్ పక్కా అన్న ఊహాగానాలు ఎక్కువయ్యాయి. అయితే మంత్రిగా అవకాశం ఇవ్వాలనుకుంటే బీసీ కోటా లేకపోతే మహిళా కోటా.. పుట్టా సుధాకర్‌యాదవ్‌లలో ఎవరికి అమాత్య యోగం వరించబోతుందో చూడాలి మరి.

## సాయిబాబ ఆలయంలో తులసీదాస జయంతి వేడుకలు

**తిరుపతి,తెలంగాణ దిశ:** తిరుపతి తిరుచానూరు రోడ్డు, శ్రీనివాస పురములోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయము నందు శ్రీ గోస్వామి తులసీదాసు జయంతి సందర్భంగా 12 గంటలు పాటు జరిగే శ్రీ హనుమాన్ చాలీసా సాముహిక అఖండ పారాయణం భక్తులు, పారాయణ బృందాల సహకారంతో ఘనంగా జరిపినట్లు సాయి మందిర్ ఆలయ వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఏఎస్పి గంగరాజు, పారాయణ బృంద నిర్వాహకులు జూపుడి చిరంజివి రావు, రాజారెడ్డి, చెంగళ్ రాయల్ తెలిపారు. పార్వతీ పరమేశ్వరుల ప్రేరణతో శ్రీ రామచరిత మానస్ రచించిన శ్రీ తులసిదాసు గారు సుందరకాండతో సమా నమైన ఫలితములనిచ్చు శ్రీ హనుమాన్ చాలీసాను శ్రీ హనుమాన్ స్వామిని ప్రత్యక్షంగా కీర్తించారని వారు తెలిపారు. అఖండ పారాయణలో సౌందర్యలహరి, సేవా



కుటుంభము, గోవిందుడు అందరివాడే, సర్వస్తోత్రనిధి, శ్రీవారి సేవా గ్రూప్, అలిపిరి పాదాలు బృంద గ్రూపులు పాల్గొనగా, హనుమాన్ చాలీసా మహిళా మండలి, హనుమత్సేవా సమితి వాళ్ళు సహాయ సహకారాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# 30 ఏళ్ల వయస్సులో బర్న్ అవుట్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఆర్థిక ఒత్తిడి, కుటుంబ సంరక్షణ విధులు మరియు కెరీర్ డిమాండ్లు 30 ఏళ్ళలో బర్న్అవుట్ కు కారణమవుతున్నాయి. ఈ 'శాండ్విచ్ జనరేషన్' పెరుగుతున్న ఆత్మహత్య రేటును ఎదుర్కొం టుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు."ఒక వ్యక్తి ఎదుర్కొంటున్న అనేక ఒత్తిళ్లలో డిప్రెషన్ ఒకటి కావచ్చు, కానీ డిప్రెషన్ తో బాధపడని వ్యక్తి కూడా ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉంది" అని అన్నారు. " 30 ఏళ్ళ వయస్సులో ఉన్నవారు తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడికి గురవుతారు. వారు బహుళ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. కెరీర్లు, పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఆర్థిక అవసరాలను నిర్వహించాల్సి ఉంటుంది.పిల్లల పెంపకం, కుటుంబ సంబంధాలు మరియు వృద్ధుల సంరక్షణ 30 ఏళ్ళ వయస్సు వారిలో మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సమాజ ఆకాంక్షలను చేరుకోవాలనే ఒత్తిడి ఒంటరితనాన్ని పెంచుతుంది. చేరుకోని జీవిత లక్ష్యాల నుండి నిరాశ వైఫల్య భావనలను సృష్టిస్తుందని మానసిక వైద్యుడు డాక్టర్ డేవిడ్ టియో వివరించారు. సోషల్ మీడియాలో ఇతరులతో జీవితాలను పోల్చడం వల్ల ఒత్తిడి పెరుగుతుందని, వెనుకబడి పోయామనే భావన కలుగుతుందని ఆయన అన్నారు.నెరవేరని లక్ష్యాలు, కలలు వైఫల్యం లేదా నిస్సహాయతకు దారితీస్తాయి. అలాగే, ఈ క్లిష్టమైన జీవిత దశలో శారీరక ఆరోగ్య సమస్యలు మరియు కొత్త మానసిక ఆరోగ్య పరిస్థితులు తరచుగా ఉద్భవిస్తాయి. ఈ ఆందోళన భారత్ సహా ప్రపంచదేశాల్లో 30 నుంచి 44 ఏళ్ల మధ్య వయసున్న అందరూ ఎదుర్కొంటున్నారు. భారతీయుల్లో కూడా 30ల వయస్సులో ఉన్నవారు ఆత్మహత్యల ముప్పును ఎదుర్కొంటున్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2022 లో ఆత్మహత్య చేసుకున్నవారిలో 18-30 సంవత్సరాల వయస్సు గలవారు 35% ఉన్నారు. 30-45 సంవత్సరాల వయస్సు గలవారు 32% ఉన్నారు. మొత్తం ఆత్మహత్య మరణాల్లో 67 శాతం ఈ వయసు వారే కావడం గమనార్హంభారతదేశంలో ఆత్మహత్యలు 2021 లో 1,64,033 నుండి 2022 లో 1,70,924 కు పెరిగాయని ఎన్సిఆర్బి డేటా తెలిపింది. జాతీయ సగటుతో పోలిస్తే నగరాల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంది. కుటుంబ సమస్యలు (31.7%), అనారోగ్యం (18.4%), వివాహ సమస్యలు (4.8%) ఆత్మహత్యలకు సగానికి పైగా కారణమయ్యాయి. బాధితుల్లో 71.8 శాతం మంది పురుషులు ఉన్నారు. తమిళనాడులో అత్యధిక సామూహిక ఆత్మహత్యలు నమోదు కాగా, ఆ తర్వాత రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఉన్నాయి.సింగపూర్ లో 2024లో 30-39 ఏళ్ల మధ్య వయసున్న 75 మంది ఆత్మహత్యలు చేసుకోగా, 2023లో 66 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఏ వయసు వారికైనా ఇదే అత్యధికం. ఈ పెద్దలు ప్రత్యేకమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటారని నిపుణులు చెబుతున్నారు. వీరికి అస్థిరమైన ఉద్యోగాలు, కుటుంబ సమస్యలు మరియు మానసిక అనారోగ్య సమస్య లు ఉన్నాయి. ఆత్మహత్యలకు సాధారణంగా నిరాశ లేదా డిప్రెషన్ మాత్రమే కారణం కాదని మనస్తత్వ శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. డిప్రెషన్ తో పాటు పలు ఇతర కారకాల కలయిక వల్ల ఆత్మహత్య భావన సంభవిస్తుందని భావిస్తున్నారు. "అన్ని ఆత్మహత్యలకు డిప్రెషన్ కారణమని తరచుగా భావిస్తారు, కాని ఆత్మహత్య తరచుగా అనేక అంశాలు మరియు జీవిత పరిస్థితుల పరస్పర చర్య వల్ల సంభవిస్తుం ది" అని నిపుణులు వివరిస్తున్నారు.

## చేతిరాత సరిగా లేదని క్యాండిల్‌తో బాలుడి చేయి కాల్చిన టీచర్



**ముంబై :** చేతిరాత సరిగా లేదనే కారణంతో ఓ టీచర్ ఎనిమిదేళ్ల బాలుడిపట్ల క్రూరంగా ప్రవర్తించింది. క్యాండిల్ వెలిగించి దానిపై బాలుడి కుడి అరిచేయి పెట్టించింది. బాలుడు ఇంట్లో ఆ విషయం చెప్పడంతో.. అతడి పేరెంట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబై లోని మలాడ్ ఏరియా లో ఈ దారుణ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఈస్ట్ మలాడ్‌లోని జేపీ డెక్స్ బిల్డింగులో రాజశ్రీ రాథోడ్ అనే యువతి ట్యూషన్స్ చెబుతుంటుంది. అదే ఏరియాలకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు మహమ్మద్ హమ్జా ఖాన్ స్థానిక లక్షధామ్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. రోజూ సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు రాజశ్రీరాథోడ్ ఇంటికి ట్యూషన్‌కు వెళ్తాడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి కూడా హమ్జా ఖాన్‌ను అతడి సోదరి ట్యూషన్‌కు పంపి వెళ్లింది. అయితే చేతిరాత సరిగా లేదని రాజశ్రీ ఆ బాలుడిపట్ల క్రూరంగా ప్రవర్తించింది. క్యాండిల్ వెలిగించి దానిపై బాలుడి కుడిచేయి పెట్టించింది. మంటలకు తాళలేక బాలుడు గుక్కతిప్పుకోకుండా ఏడవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో హమ్జా ఖాన్ బాగా ఏడుస్తున్నాడని, వెంటనే వచ్చి ఇంటికి తీసుకెళ్లాలని టీచర్ రాజశ్రీ రాథోడ్ బాలుడి తండ్రి ముస్తకీన్ ఖాన్‌కు ఫోన్ చేసింది. దాంతో ముస్తకీన్ వచ్చి బాలుడిని ఇంటికి తీసుకెళ్లాడు. అయితే ఇంటికి తీసుకెళ్లిన తర్వాత బాలుడు విషయం చెప్పడంతో అతడి పేరెంట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఆదానీ ప్రాజెక్టులు రద్దు..



**విజయనగరం,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు అప్పగించిన రెండు ప్రధాన పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను రద్దు చేసింది. స్థానిక వివాదాలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల మధ్య సరిహద్దు సమస్యలు ఈ నిర్ణయానికి కారణమయ్యాయని తెలుస్తోంది. గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా, ప్రస్తుత పరిస్థితి రెండు ప్రాజెక్టుల పురోగతికి అడ్డంకిగా నిలిచిందని పేర్కొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం దిగ్గజ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టిన రెండు పవర్ ప్రాజెక్టులను రద్దు చేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కు అనుమతులు ఇచ్చిన రెండు పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మన్యం పార్వతీపురం జిల్లాలోని కురుకుట్టిలో 1,200 మెగావాట్లు, కర్రివలసలో 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాల ప్రాజెక్టులను స్థానిక సమస్యల కారణంగా రద్దు చేయాలని అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కోరింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. అయితే, ఆంధ్రప్రదేశ్, ఒడిశా మధ్య సరిహద్దు వివాదాల కారణంగా ఈ ప్రాజెక్టులను రద్దు చేయాలని అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కోరినట్లు తెలుస్తోంది. 'స్థానిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్టులను రద్దు చేయాలని ఏజీఈఎల్ ప్రభుత్వానికి లేఖ రాసింది. వివిధ వాటాదారులతో సంప్రదించిన తర్వాత, ప్రభుత్వం 1200 మెగావాట్ల కురుకుట్టి, 1000 మెగావాట్ల కర్రివలస పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను రద్దు చేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది.' అని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి కె. విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు.అదానీ గ్రీన్ సంస్థ ఈ రెండు ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు గతంలో అనుమతి పొందింది. 2022 జూన్ 29న అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఈ అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుల సాధ్యాసాధ్య నివేదికలను టీసీఈ లిమిటెడ్‌ను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ తయారు చేసింది. సర్వేలు, పరిశోధనలు, వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక తయారీ బాధ్యతను అదానీ గ్రీన్ తీసుకుంది. అయితే సెప్టెంబర్ 12, 2024న ఒడిశా, ఆంధ్రప్రదేశ్ మధ్య సరిహద్దు వివాదం తలెత్తిన కారణంగా ఈ రెండు ప్రాజెక్టులను రద్దు చేయాలని అదానీ సంస్థ అభ్యర్థించింది. కంపెనీ చెల్లించిన ఫెసిలిటేషన్ ఛార్జీలను తిరిగి చెల్లించాలని లేదా 1000 మెగావాట్ల పెదకోట, 600 మెగావాట్ల రైవాడ ఖూఖ ప్రాజెక్టుల కు బదిలీ చేయాలని కోరింది. ఈ క్రమంలో పెదకోట, రైవాడ ప్రాజెక్టులను కూడా ఆదారీ కంపెనీకు కేటాయించారు.అదానీ సంస్థ రద్దు ప్రతిపాదనను జూలై 17న జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిసమావేశంలో ఉంచారు. డెవలపర్ అభ్యర్థన మేరకు స్థానిక సమస్యల కారణంగా కురుకుట్టి, కర్రివలస ప్రాజెక్టులను రద్దు చేయడానికి అంగీకరించారు. అని ముఖ్య కార్యదర్శి విజయానంద్ తెలిపారు. స్థానిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్టులు రద్దు చేయాలని అదానీ గ్రీన్ లేఖ రాసిన క్రమంలో రద్దు చేసినట్లు చెప్పారు.

# వస్తానంటున్న... రాజాసింగ్



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి వార్తల్లో నిలిచిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వరుసగా స్వామిజీలను దర్శించుకుంటున్నారు. ఈ రోజు శంఖేశ్వర్ భవన్‌లో కొలువైన పూజ్య ఆచార్య శ్రీ నూరీశ్వర్జీ మహారాజ్ ను దర్శించుకున్నారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్ర-సంత్ శ్రీ లలితప్రభ జీ, శ్రీ చంద్రప్రభ జీని సైతం దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. వీరి ఆశీర్వాదంతో సమాజం, దేశ సేవ చేయాలనే తన సంకల్పానికి మరింత శక్తి లభిస్తుందన్నారు. ఈ వివరాలను రాజాసింగ్ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. అయితే.. రాజాసింగ్ వరుసగా స్వామిజీలను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటుండడం హాట్ టాపిక్ గా మారింది.బీజేపీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన ఏ పార్టీలోనూ ఇంత వరకు చేరలేదు. భవిష్యత్ కార్యాచరణపై ఆయన త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తారని.. ఈ నేపథ్యంలోనే స్వామిజీలను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారన్న చర్చ సాగుతోంది. 2014, 18, 23 ఎన్నికల్లో బీజేపీ నుంచి గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల బరిలో దిగిన రాజాసింగ్ హ్యాట్రిక్ విజయాలు అందుకున్నారు. 2018-23 మధ్య ఆయన ఓ సారి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఓ వర్గంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న విమర్శల నేపథ్యంలో హైకమాండ్ ఈనిర్ణయం తీసుకుంది. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికల కు కొన్ని రోజుల ముందు ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. సస్పెన్షన్ ఎత్తివేసి మళ్లీ గోషామహల్ నుంచి పార్టీ అభ్యర్థిగా బరిలోకి దించింది బీజేపీ. ఆ ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. బీజేపీ నుంచి 2023లో తెలంగాణలో గెలిచిన ఎమ్మెల్యేలందరిలో రాజాసింగ్ మాత్రమే పార్టీలో సీనియర్. అత్యధిక సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది కూడా ఆయనే.
కానీ పార్టీ హైకమా ండ్ మాత్రం మహేశ్వరరెడ్డికి అవకాశం ఇచ్చింది. అనంతరం వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఆశించారు. కానీ మాధవిలతను అక్కడి నుంచి పోటీకి దించింది బీజేపీ హైకమాండ్. ఈ రెండు విషయాల్లో తీవ్ర మనస్థాపానికి గురైన రాజాసింగ్.. పార్టీ పెద్దలను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తూ వచ్చారు.
ముఖ్యంగా రాష్ట్రంలో అగ్రనేతలు అని చెప్పుకునే వారే పార్టీ ఎదగకపోవడానికి కారణమని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడిగా రామ్ చందర్ రావును నియమించిన రోజే ఆయన రాజీనామా చేశారు. అయితే.. పార్టీ రాష్ట్ర నేతలపై దుమ్మెత్తి పోస్తున్న రాజాసింగ్.. మోదీ, అమిత్ షాలపై మాత్రం పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. దీంతో ఆయన మళ్లీ బీజేపీలోకి ఎంట్రి ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ కూడా సాగుతోంది.

# నకిలీ సంతానోత్పత్తి కేంద్రాలపై నిఘా

**విజయవాడ,తెలంగాణ దిశ:** తెలుగు రాష్ట్రాల్లో బయటపడిన నకిలీ సంతానోత్పత్తి కేంద్రం స్కామ్ తీవ్ర సంచలనంగా మారింది. దానితో రాష్ట్రంలో సంతానోత్పత్తి సేవలందిస్తున్న పలు కేంద్రాల(ఫెర్టిలిటీ సెంటర్స్)పని తీరును క్షుణ్ణంగా పరిశీలించి వివిధ అంశాలకు సంబంధించి ఒక సమగ్ర నివేదికను అందించాలని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కేంద్రంగా సంతానోత్పత్తి సేవలందిస్తున్న ఒక ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు వార్తలు వస్తున్న వేళ ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తనిఖీలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. జిల్లా స్థాయిలో ఆసుపత్రుల స్థాపనకు డిఎమ్ హెచ్ఓ లు ( డిస్ట్రిక్ట్ హెల్త్ అండ్ మెడికల్ ఆఫీసర్స్ అనుమతు లు మంజూరు చేస్తారుతదనంతరం నిర్వహణ నియమాల మేరకు పని చేసే విషయాన్ని కూడా డిఎమ్‌హెచ్‌ఓలు పర్యవేక్షించి, నియమా లను ఉల్లంఘించే ఆసుపత్రులపై తగు చర్యలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారుఅధికారిక సమాచారం మేరకు రాష్ట్రంలో పని చేస్తున్న సంతానోత్పత్తి కేంద్రాల సంఖ్య , గూగుల్ ద్వారా వెతికినపుడు వచ్చిన ఫెర్టిలిటీ సెంటర్ల సంఖ్యలో వ్యత్యాసమున్నట్లు ప్రభుత్వానికి తెలిసింది. రాష్ట్రంలో డిఎమ్‌హెచ్ఓ లు మొత్తం ఎన్ని కేంద్రాలకు అనుమతులిచ్చారు, అనుమతులు లేకుండా ఎన్ని పనిచేస్తున్నాయి, 2024-25 లో ఆయా జిల్లాల్లో ఎన్ని కేంద్రాలను పరిశీలించారు, లైసెన్స్ లేకుండా పనిచేస్తున్న కేంద్రాలు ఎన్ని తేలాయి, ఆయా ఫెర్టిలిటీ సెంటర్ల పనితీరుపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిపై ఏమి చర్యలు తీసుకున్నారు , ఎన్ని కేంద్రాలకు అనుమతులు నిరాకరించారు, నియమాలమేరకు ఈ ఫెర్టిలిటీ సెంటర్లు పనిచేసేలా చూడటానికి ఏమి చేపట్టారు అనే అంశంపై సమగ్ర నివేదికను అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు ఎన్ టీ అర్ జిల్లా డి ఎమ్ హెచ్ ఓ విజయవాడలో పనిచేస్తున్న యూనివర్సల్ హెల్త్ కేర్ సెంటర్ పై తమ బృందంతో కలసి తనిఖీకి వెళ్లగా ఆ కేంద్రం మూసి ఉన్నట్లు డి ఎమ్ హెచ్ ఓ డా. సుహాసిని మంత్రి కార్యాలయానికి తెలిపారు. అక్రమాల ఆరోపణలతో అరెస్ట్ అయిన డా. నమ్రత పేరిటనే యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ మంజూరు అయిందని, తనిఖీ సమయానికి ఈ సెంటర్ సిబ్బంది ఎవరు లేకుండా మూసి ఉండటం అనుమానాలకు దారి తీస్తోందని, ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు చేపడతారని డిఎమ్ హెచ్ ఓ తెలిపారు. జరుగుతున్న పరిణామాలతో రాష్ట్రంలో ఎన్ని నకిలీ సంతానోత్పత్తి కేంద్రాలు ఉన్నాయో అన్న అనుమానం ప్రజల్లో కలుగుతోంది. అయితే పూర్తిస్థాయిలో తనిఖీలు చేసి నకిలీ ఫెర్టిలిటీ సెంటర్లపై రైలు తీసుకుంటామని వైద్యశాఖ హామీ ఇస్తోంది.

# ముద్రా పేరుతో మాయ?

**కరీంనగర్,తెలంగాణ దిశ:** ముద్ర అగ్రికల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ తిప్పనేని రామదాసప్పను తెలంగాణ సీఐడీ అధికారులు అమరావతిలో అరెస్టు చేశారు. రైతులు, నిరుద్యో గులు,రోజువారీ కూలీలను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో 2 మంది బాధితుల నుంచి రూ.140 కోట్లు వసూలు చేసిన కేసులో రామదాసప్పతో పాటు ఆయన కుమారుడు తిప్పనేని సాయి కిరణ్‌ను హైదరాబాద్ లో అదుపులోకి తీసుకున్నారు. సీఐడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 2 వేల మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిందితులు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఆ ప్రకటనలు చూసిన పలువురు నిరుద్యోగులు రెండు రాష్ట్రాలకు చెందిన పలువురు బాధితులు వారిని సంప్రదించారు. వారి బలహీనతను అసరా చేసుకున్న నిందితులు వారి వద్ద పెద్ద మొత్తాల్లో నగదు వసూలు చేశారు. అనంతరం వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పి రైతుల నుంచి పెట్టుబడులకు ఉసికొల్పారు. వారినుంచి పెట్టుబడులు తేకుంటే మీ జీతం నుంచి తీసుకుంటానని, సర్టిపికె ట్లు ఇవ్వనని వేధించాడు. ఈ విషయమై తెలంగాణ, ఏపీలలో పలువు రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగాఈ విషయమై తీగలాగితే పెద్ద డొంక కదిలింది. ఉద్యోగాలు, అధిక వడ్డీల పేరుతో కోట్లు కొల్లగొట్టినట్లు తేలడంతో కేసును సీఐడీకి అప్పగించారు. విచారణ జరిపిన సీఐడీ ఇద్దరినీ అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది.కేంద్రప్ర భుత్వ ప్రధాన మంత్రి ముద్ర యోజన పేరుతో రామదాసప్ప నాయుడు సహకార సంఘాన్ని స్థాపించాడు. ఇది ప్రభుత్వ సంస్థ అని నమ్మించాడు. ఈ సంఘంలో పెట్టుబడి పెడితే డిపాజిట్లపై అధిక వడ్డీని ఇస్తానని, సభ్యులుగా చేరిన వారికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను ఇస్తానని హామీ ఇచ్చాడు. సొసైటీని త్వరలో ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకు గా మారుస్తామని కూడా అతను చెప్పాడు. ఈ హామీలు, ముఖ్యంగా వార్తపత్రికల్లో ఇచ్చిన ప్రకటనల్లో 2,000 'ప్రభుత్వ మార్కెటింగ్ సూపర్‌వైజర్' ఉద్యోగాలను ఇస్తామని మభ్య పెట్టాడు. దీనికోసం 1,600 మంది ఉద్యోగులను నియమించుకున్నాడు. ఆ సమయంలో వారి ఒరిజనల్ సర్టిఫికెట్లను కూడా తీసుకున్నారు.బాధితులను వాటా మూలధనం , పెట్టుబడి బాండ్లను కొనుగోలు చేసే నెపంతో డబ్బు డిపాజిట్ చేయమని కోరారు.ఇక రైతులు, చిన్నవ్యాపారుల నుంచి డిపాజిట్లు సేకరించాలని మార్కెటింగ్ సూపర్‌వైజర్లుగా నియమించ బడిన ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. డిపాజిట్ లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన ఫలితంగా ఉద్యోగుల జీతాల నుండి కోతలువిధించారు. అయితే ఉద్యోగం నచ్చక రాజీనామా చేసిన వారికి వారి సర్టిఫికెట్లు, రిటర్న్‌లను ఇవ్వడానికి నిరాకరించారు. కాగా ప్రజల నుండి వసూలు చేసిన పెద్ద మొత్తాలను ఆంధ్రప్రదేశ్‌లోని లిమిటెడ్ ద్వారా పారిశ్రామిక ప్లాట్లను కొనుగోలు చేయడానికి మళ్లించారని దర్యాప్తులో తేలింది. మోసపూరిత సొసైటీ సుమారు 330 శాఖలను తెరిచి 2,000 మందికి పైగా బాధితులను మోసం చేసిందని భావిస్తున్నారు. కాగా బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ అంతటా నల్లకుంట, కాచిగూడ, గంభీరావుపేట, రామాయంపేట, దుబ్బాక, వేములవాడ, అచ్చంపేట, ఆత్మకూర్ సహా వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితులపై కేసులు నమోదయ్యాయి. ఐపీసీ సెక్షన్లు 406 (నేరపూరిత నమ్మక ద్రోహం), 420 (మోసం), 506 (నేరపూరిత బెదిరింపు), 409 (ప్రభుత్వ ఉద్యోగి లేదా బ్యాంకర్ ద్వారా నేరపూరిత నమ్మక ద్రోహం), మరియు తెలంగాణ ఆర్థిక సంస్థల డిపాజిట్ల రక్షణ సంబంధిత నిబంధనల కింద నమోదు చేశారు. కాగా. సేకరించిన నిధులను ఎక్కడికి తరలించారు. ఇతర లబ్ధిదారులు ఎవరు? అనే కోణంలో సీఐడీ దర్యాప్తు జరుపుతోంది


## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
## ఉచితంగా కృతిమ చెయ్యి అమరిక




**కమాన్ పూర్,తెలంగాణ దిశ:** లైన్స్ క్లబ్ సెంటినరీ కాలనీ వారి ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ చెయ్యి అమరించారు. మంథనికి చెందిన సయ్యద్ హుస్సేన్ కు సహాయం చేసిన లయన్స్ డాక్టర్ శరణ్య యాదవ్ మరియు క్లబ్ - సయ్యద్ హుస్సేన్ ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో మంథనికి చెందిన సయ్యద్ హుస్సేన్ కు కృతిమ చెయ్యి ను అమర్చడం జరిగింది. అనంతరం క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ సయ్యద్ హుస్సేన్ కు ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్లో తన కుడి చేతిని తొలగించడం జరిగింది.లయన్స్ క్లబ్ ద్వారా కృతిమ చెయ్యి ను అమరుస్తారని విషయం తెలుసుకొని తమ మిత్రుడు గుండం సురేష్ ద్వారా మా లయన్స్ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య యాదవ్ దృష్టికి తీసుకురాగా వెంటనే లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని చెందిన పాస్ట్ జెడ్ సి రాజేందర్ ని సంప్రదించి సయ్యద్ హుస్సేన్ వివరాలు, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితినీ వివరించి సహాయం చేయాలని కోరగా వారు వెంటనే సానుకూలంగా స్పందించి నెల క్రితం చేతి కొలతలు తీసుకొని తయారుచేసి ఈరోజు ఉచితంగా కృతిమ చెయ్యి ను అమర్చడం జరిగిందనీ తెలిపారు.దీనిలో ముఖ్య పాత్ర పోషించిన లయన్స్ పాస్ట్ జెడ్ సి రాజేందర్ , డాక్టర్ శరణ్య యాదవ్ కు ధన్యవాదములు తెలుపుతూ లయన్స్ క్లబ్ ఎప్పుడు పెద ప్రజలకు సహాయం చేయడానికి ముందుంటుందని తెలిపారు.ఇంకా ఎవరైనా కృతిమ కాలు, చెయ్యి అవసరం ఉన్న వారు మమ్ములను సంప్రదించాలని తెలిపారు. సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ నా యొక్క పరిస్థితి అర్థం చేసుకొని నాకు ఉచితంగా కృతిమ చెయ్యి అమర్చడానికి సహాయం చేసిన డాక్టర్ శరణ్య యాదవ్ కి,రాజేందర్ కి మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి మరియు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వైద్య నిపుణురాలు లయన్స్ డాక్టర్ శరణ్య యాదవ్, లయన్స్ మేకల మారుతి యాదవ్,గుండం సురేష్,బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జనాల్లోకి మంత్రులు...

## సీనియర్లు చివరి ప్రయత్నాలు



**విజయవాడ,తెలంగాణ దిశ:** ఏపీలోమంత్రులు ఒక రకమైన భయం కనిపిస్తోంది. వారిలో స్పష్టమైన మార్పు కనిపిస్తుండడం విశేషం. 'మారండి లేకుంటే మార్చేస్తాను' అన్న సీఎం చంద్రబాబు హెచ్చరిక వారిలో గట్టిగానే పని చేస్తోంది. మంత్రులు నేరుగా ప్రజల్లోకి వెళ్లడంతో పాటు కీలక ప్రకటనలు చేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థి వైసీపీకి గట్టి హెచ్చరికలే జారీ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రుల కదలికలు మారాయి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. మారుమూల గ్రామాలకు సైతం వెళుతున్నారు. అయితే ఇదంతా సీఎం చంద్రబాబు హెచ్చరికల వల్లే సాధ్యమైందన్న టాక్ వినిపిస్తోంది. మారకపోతే మార్చేస్తాను అంటూ హెచ్చరికలే మంత్రులతో పని చేయిస్తున్నాయి అన్న టాక్ వినిపిస్తోంది. మంత్రుల దూకుడు చూస్తుంటే.. వారంతా సేఫ్ జోన్ లోకి వచ్చేందుకు ఆరాటపడుతున్నట్లు అర్థమవుతోంది.సోషల్ మీడియా వచ్చాక క్షణాల్లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ పై తెగ ప్రచారం నడుస్తోంది. ఏకంగా ఎనిమిది మంది మంత్రులపై వేటు వేస్తారని టాక్ నడుస్తోంది. ఇలా తొలగింపు జాబితాలో ఉన్న మంత్రులు వీరేనంటూ నేరుగా ప్రకటిస్తున్నారు. దీంతో ఈ జాబితాలో ఉన్న మంత్రులు ఆందోళనకు గురవుతున్నారు. మంత్రి పదవి చేపట్టి ఏడాదికే పదవులు ఊడిపోతే.. తమ రాజకీయ జీవితానికే మాయని మచ్చగా మిగిలిపోతామని ఎక్కువమంది భయపడుతున్నారు. అందుకే కాలికి బలపం పట్టుకొని మరి నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. తమ జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే నిత్యం నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదికలు ఇస్తున్నాయి. దీంతో తామంతా సేఫ్ జోన్ లోకి వస్తామని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారుప్రస్తుతం రాష్ట్రమంతటా సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో మంత్రులంతా పాల్గొంటున్నారు. మహిళా మంత్రులు సైతం ఉత్సాహంగా హాజరవుతున్నారు. ఈ శాఖ, ఆ శాఖ అన్న తేడా లేకుండా.. అన్ని శాఖల మంత్రులు ప్రజల్లోకి వస్తున్నారు. ప్రస్తుతం ఏపీ క్యాబినెట్లో 24 మంది మంత్రులు ఉన్నారు. అందులో జనసేన నుంచి ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు ఉన్నారు. మిగతా 19 మంది తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. అయితే ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి ఓ ఇద్దరూ.. ఉభయగోదావరి జిల్లాల నుంచి మరో ఇద్దరూ.. కోస్తాంధ్ర పరిధిలో మరో ఇద్దరు.. రాయలసీమ నుంచి ఇద్దరు మంత్రులు సర్వేల్లో వెనుకబడ్డారని.. వీరందరిపై వేటు వేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సీనియర్లు సైతం ఎవరికి వారుగా మంత్రి పదవులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇదంతా మంత్రుల్లో కలవరం పెంచేలా ఉంది. అందుకే సీఎం ఆదేశించినట్లు ప్రజల మధ్యకు వెళ్లేందుకు సూపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని వాడుకుంటున్నారు.ప్రస్తుతం సీనియర్ మంత్రులుసైతం చురుగ్గానే పాల్గొంటున్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి హెచ్చరికలే పంపుతున్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబుతో పాటు మరో ముగ్గురు మంత్రులు సింగపూర్ పర్యటనలో ఉన్నారు. దీంతో మిగిలిన 16 మంది మంత్రులు జిల్లాల పర్యటనలో బిజీగా ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ ప్రచారం ఒకవైపు.. సీనియర్ల ప్రయత్నాలు ఇంకోవైపు వారిలో కలవరానికి గురిచేస్తున్నాయి. అందుకే రెడ్, ఆరెంజ్ జోన్ నుంచి గ్రీన్ జోన్లోకి వచ్చేందుకు మంత్రులు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. కనీసం ఆరెంజ్ జోన్లోకి వచ్చినా.. తాము సేఫ్ జోన్ లోకి వస్తామని భావిస్తున్నారు. చూడాలి వారి ప్రయత్నాలు ఎంత వరకు వర్క్ అవుతాయో..?

# చైనాలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బంగారం షాపు

## నగల కోసం ప్రజలు వెతుకులాట నెట్టింట వైరల్‌గా మారిన దృశ్యాలు



బీజింగ్, : చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కొందరు ఈ పని కోసం వానలో తడుస్తూ వెతకడం మొదలు పెట్టారు. షాపు ముందు నుంచి కాలువలా వెళ్లిన చోటల్లా వెతుకుతూ కనిపించారు. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీ-లో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు- దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు- తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైనే ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇలా వెతుకుతున్న వారిని చూసి మరికొందరుకూడా రంగంలోకి దిగడం విశేషం.

# అజారుద్దీన్ కే అవకాశం



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది హాట్ టాఫిక్‌గా మారింది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో ఇక్కడ బైపోల్ రాగా.. అధికార కాంగ్రెస్ నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయం ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ దాదాపు ఒకనిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ అభ్యర్థి ఎంపికపై ఓ క్లారిటీ ఇచ్చారు. స్థానిక వ్యక్తికే టికెట్ ఇస్తామని ప్రకటించారు. ఈ ఉప ఎన్నికకు కాంగ్రెస్ నుంచి పలువురి పేర్లు చర్చల్లో ఉన్నాయి. గతంలో ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన భారత మాజీ క్రికెటర్, సీనియర్ కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్, దివంగత నేత పీజేఆర్ కూతురు విజయా రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన రోహిన్‌రెడ్డి, నవీన్ యాదవ్, నాంపల్లి నుంచి పోటీ చేసి ఓడిపిపోయిన ఫిరోజ్ ఖాన్ తదితరులు రేసులో ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్ మైనారిటీ ప్రతినిధు లు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ను కలిశారు. కేబినెట్‌లో మైనారిటీలకు ప్రాతినిధ్యం లేనందున.. కనీసం ఈఉప ఎన్నికటికెట్‌ను తమ వర్గానికి కేటాయించా లని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో వారు అజారుద్దీన్ పేరును బలంగా బలపరిచినట్లు సమాచారం. ఈ విజ్ఞప్తిని పీసీసీ చీఫ్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా.. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అజారుద్దీన్ వైపే అధిష్టానం మొగ్గ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌లు సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తున్నట్లు తెలిసింది. అభ్యర్థిగా అజారుద్దీన్ పేరును ఫిక్స్ అయ్యారని.. అధికారికంగా ప్రకటించటం ఒక్కటే మిగిలి ఉందని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

కాగా, ఈ నిర్ణయంపై ఫిరోజ్ ఖాన్ అసహనం వ్యక్తం చేశారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. గెలిచే వారికే అవకాశం ఇవ్వాలని అన్నారు. స్థానికులకే టికెట్ ఇస్తామనటం సరికాదన్నారు. రాహుల్, ప్రియాంక ఎక్కడ్నుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారో ఓసారి తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. కాగా, ఈ ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటు న్నాయి. హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలాన్ని చూపించడానికి, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇది ఒక బలమైన సంకేతంగా కాంగ్రెస్ భావిస్తుంది. ఈ ఉప ఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుందని.. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది.

# పెంటఖుర్దులో కొత్త కల్యాణీ చాళుక్యుల శాసనం





**హైదరాబాద్,తెలంగాణ దిశ:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం లోని పెంటఖుర్దులో కొత్త కల్యాణి చాళుక్యుల శాసనం వెలుగు చూసిందని కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్, చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. గ్రామానికి చెందిన శివాలాయ భక్తుల కృషివల్ల ఈ శాసనం గురించి తెలియవచ్చిందని చెప్పారు. 'పెంటఖుర్దులో శిథిల శివాలయముండేది. 1984లో నాటి గ్రామ సర్పంచు పరుచూరు రాంచందర్ రావు, యలవర్తి జయరామారావు, కొడాలిసూర్యుడమ్మ ఈ దేవాలయాన్ని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా పురాతన ఆలయ శిథిలాలలో లభించిన శాసనస్తంభాన్ని భద్రపరిచారు. ఈ శాసనంలోని విషయాన్ని తెలుసుకోవడానికి గ్రామానికి నివాసులు బీవీ భాస్కర్ రెడ్డి, గడ్డం వీరరాజారావు, మద్దినేని శ్రీనివాసరావు,ముక్కల శ్రీనివాసరెడ్డి, కొత్తపల్లి నాగేశ్వరరావు, చిట్టెం శివసాయి పటేల్, గైని గంగారాం, జంగం సంజప్ప, నాగల్ల కోటేశ్వరరావు, బీ.నాగిరెడ్డి, డీ.హరీశ్ చేసిన కృషివల్ల కొత్తశాసనం వెలుగులోకి వచ్చింది. శ్రీశ్రీమల్లికార్జున దేవాలయ ప్రాంగణంలో నిలిపివున్న రాతిస్తంభానికి మూడు వైపులా 47పంక్తులలో 11వ శతాబ్దపు తెలుగున్నడలిపిలో, కన్నడభాషలో చెక్కబడిన శిలాశాసనం ఉన్నది. కల్యాణీచాళుక్య చక్రవర్తి త్రైలోక్యమల్లదేవర పాలనాకాలంలో క్రీ.శ.1058 మార్చి 10వ తేదీన వేయబడిన సావడిగేయ పొంరయ అనే భక్తుడు నకరేశ్వర దేవాలయం కొరకు చేసిన దానాలు గురువు దివాకర భట్టారకయ్యకు అందజేశాడు. కొంతభూమి గుడి నిర్వహణకు దానంచేయబడింది. సూర్యగ్రహణ సందర్భంగా చేసిన దానాలలో గుడికి చెల్లేటట్లు బాటసుంకం, బిట్టకొట్టసుంకం వంటి కొన్నిరకాల పన్నులు మాఫీచేయబడ్డాయి. పెంటఖుర్దుకు 4 కిలోమీటర్ల దూరంలోని కోటవున్న కోటగిరి వద్ద తోట, బావి, 25 రూకల ద్రవ్యమిచ్చినట్లు శాసనం ద్వారా తెలుస్తున్నది. ఈ శాసనం ఆనాటి సామాజిక సంస్కృతికి అద్దంపడ్తున్నది. పేరులోనే ప్రాచీనతను దాచుకున్న గ్రామం పెంటఖుర్దు.' శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు.

# గాజాలో ఆకలిచావులు



గాజా: హమాస్‌ను శిక్షించే పేరుతో గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం మొదలుపెట్టి 22 నెలలు కావస్తున్నది. ఆ లక్ష్యం ఎప్పుడు నెరవేరుతుందో తెలియదు గానీ 20 లక్షల మంది గాజావాసులు మాత్రం నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా జరుపుతున్న దాడులతో ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం అన్ని హద్దులూ దాటిపోయిందని చెప్పవచ్చు. ఇజ్రాయెల్ దాడుల్లో మరణించినవారి సంఖ్య 60 వేలు దాటడం ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేస్తున్నది. మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నపిల్లలే కావడం మరీ దారుణం. ఆకాశం నుంచి కురుస్తున్న అగ్నిగోళాలతో బూడిదకుప్పగా మారిన గాజాలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. పోషకాహార లోపంతో చిక్కిశల్యమైన పసివాళ్ల ఫొటోలు హృదయాలు ద్రవింపజేస్తున్నాయి. తల్లులు పిల్లలకు పాలసీసాల్లో ఉత్త నీళ్లు పడుతున్నారంటే అక్కడ ఎంతటి దీనస్థితి నెలకొన్నదో తెలుస్తున్నది. సుమారు రెండేండ్లుగా గాజా ఆహార కొరతను ఎదుర్కొంటున్నది. ఇటీవలి కాలంలో ఇజ్రాయెల్ అష్టదిగ్బంధం చేస్తుండటం వల్ల ఆహార పదార్థాలు బాధితులకు చేరుకోవడం గగనమవుతున్నది. ఫలితంగా పోషకాహార లోపం ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు 74 ఆకలిచావులు సంభవిస్తే అందులో 63 ఒక్క జూలైలోనే జరిగాయి. మృతుల్లో 24 మంది ఐదేండ్ల లోపు పసిపిల్లలు కావడం విషాదకరం. గాజాలో ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వారి సంఖ్య కేవలం రెండు నెలల్లోనే మూడింతలు కావడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. గాజాలో ఆహార సమస్య సంక్షోభంగా మారుతున్నదని ఇది సూచిస్తున్నది. ప్రపంచదేశాలు, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్ సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కానీ, ఇజ్రాయెల్ సహాయ బృందాలపైనా దాడులు జరుపుతుండటం తీవ్రమైన మానవీయ సంక్షోభానికి దారితీసింది. తక్షణం చర్యలు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆకలిచావులు తప్పవని ఐరాస అత్యవసర సహాయ విభాగం అధిపతి కీత్ ఫ్లెచర్ ఒక నివేదికలో హెచ్చరించడం గమనార్హం. ఐరాస అధికారికంగా క్షామాన్ని ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. 'అమ్మ పెట్టదు, అడుక్కు తిననివ్వదు' అన్నట్టుగా ఇజ్రాయెల్ అనుసరిస్తున్న మొండివైఖరి ఫలితంగా నేడు గాజాలో కృత్రిమ క్షామం నెలకొన్నదన్నది వాస్తవం. ప్రపంచ దేశాలు పంపిస్తున్న మానవతా సాయం సరిహద్దుల్లో ముగుగుతుంటే, అటు గాజా పౌరులు ఆకలితో అలమటిస్తున్నారు. హమాస్ పాలన స్థిరపడుతుందనే సాకుతో ఇజ్రా యెల్ ఆహార పదార్థాల సరఫరాను అడ్డుకుంటుండటం విడ్డూరం. ఇన్నాళ్లూ ఆహార కొరత లేదన్నట్టుగా వ్యవహరించిన ఇజ్రాయెల్ 'కొంత మేర' ఆకలి సమస్య ఉన్నట్టు అంగీకరించడం మరీ విడ్డూరం. అంతర్జాతీయంగా విమర్శలు అధికం కావడంతో ఇజ్రాయెల్ దాడులకు రోజువారీగా పరిమిత విరామం అమలు చేయనున్నట్టు ప్రకటించింది. అది 'సంపూర్ణ విరామం'గా ఎప్పుడు మారుతుందా? అని ప్రపంచం వేయి కండ్లతో ఎదురుచూస్తున్నది.

## ఏఎంసి చైర్మన్ వెంకన్న ను సన్మానించిన

# సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



**మంథని,తెలంగాణ దిశ:** మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా నియామకమైన కుడుదుల వెంకన్నను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంఘ డైరెక్టర్లు శాలువాతో ఘనంగా సత్కరించినారు. మంథని ఏఎంసి కార్యాలయంలో వెంకన్నకు టోపీ బహుకరించినారు. డైరెక్టర్లు కన్నెబోయిన ఓదెలు, ఎండి అంకుస్, రావికంటి వెంకటేష్ లతో పాటు పాలక వర్గాన్ని శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు నమ్మిన బంటుగా ఉంటూ గత ఎన్నికల్లో మంత్రి శ్రీధర్ బాబు విజయంలో వెంకన్న కీలక పాత్ర పోషించారని అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వెంకన్నకు కాంగ్రెస్ పార్టీ ద్వారా తగిన గుర్తింపు లభించిందని అన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వెంకన్న ను ఏఎంసి చైర్మన్ గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు లకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు.

ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు కొత్త శ్రీనివాస్, లెక్కల కిషన్ రెడ్డి, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, నాయకులు ఊదరి శంకర్, పెంటరి రాజు, సాదుల శ్రీకాంత్, దొరగోర్ల శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెద్దపెల్లి జిల్లా ఇంచార్జ్ ఆరెల్లి కిరణ్ గౌడ్, నాయకులు పర్శవేని మోహన్,ఆరెల్లి వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో ఫ్యామిలీ మల్టీప్లెక్స్

**రాజమండ్రి,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో సినిమా చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ప్రకృతి వేదిక అనే సంస్థ దేశంలోనే మొదటిసారిగా, కొత్తగా విడుదలయ్యే సినిమాలను కూడా చూపించే ప్రైవేట్ సినిమా థియేటర్లను ప్రారంభించింది. ఇవి కేవలం ఫ్యామిలీలు, ఫ్రెండ్స్ గ్యాంగ్స్ కోసం ప్రత్యేకంగా బుక్ చేసుకోవచ్చు. ఇది సినిమా చూసే అనుభూతిని పూర్తిగా మార్చబోతోంది. క్యూబ్ సినిమా టెక్నాలజీస్‌తో కలిసి, ప్రకృతి వేదిక తమ కాంప్లెక్స్‌లోనే రెండు ప్రత్యేకమైన 20 సీట్ల లగ్జరీ థియేటర్లను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో ఒక వైపు సొంతంగా సినిమా చూస్తున్నామనే ఫీలింగ్, మరోవైపు కొత్త సినిమా మొదటి రోజు చూసే థ్రిల్ రెండూ ఉంటాయి. ఈ కొత్త కాన్సెప్ట్‌ను మినీ మల్టీప్లెక్స్ అని పిలుస్తున్నారు. ఇందులో రెండు వేర్వేరు స్క్రీన్‌లు ఉంటాయి. ఒక్కో స్క్రీన్‌ను ఒకే కుటుంబం లేదా ఒకే గ్రూప్ బుక్ చేసుకోవచ్చు. దీనివల్ల ప్రేక్షకులు కొత్త సినిమాలను జనాల రద్దీ లేకుండా, చాలా సౌకర్యంగా చూడొచ్చు. డిజిటల్ సినిమా సొల్యూషన్స్‌లో ముందున్న క్యూబ్ సినిమా టెక్నాలజీస్‌తో కలిసి పని చేయడం వల్ల, ఇక్కడ సినిమా హాల్‌లో ఉండే అద్భుతమైన సౌండ్, పిక్చర్ క్వాలిటీతో పాటు,

సినిమా డిస్ట్రిబ్యూటర్ల నెట్‌వర్క్‌తో నేరుగా అనుసంధానమై ఉంటుంది. భారతదేశ వినోద మార్కెట్‌లో ఇది ఒక పెద్ద మార్పు. చాలా చోట్ల ప్రైవేట్ స్క్రీనింగ్ రూమ్‌లు ఉన్నా, వాటిలో సొంతంగా ఓటీటీ నుంచి తెచ్చుకున్న సినిమాలు మాత్రమే చూడగలం. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి సినిమాలను వాణిజ్యపరంగా ప్రదర్శించడానికి లైసెన్స్ పొందిన మొదటి సంస్థ ప్రకృతి వేదిక. అంటే, డిస్ట్రిబ్యూటర్లు విడుదల చేసే కొత్త సినిమాలను చట్టబద్ధంగా ఇక్కడ చూపించవచ్చు. ప్రకృతి వేదిక వ్యవస్థాపకుడు జి.వి. శ్రీరాజ్ మాట్లాడుతూ.. "ఈ కమర్షియల్ లైసెన్స్ పొందడం, క్యూబ్ సినిమా లాంటి పెద్ద సంస్థతో కలిసి పని చేయడం చాలా ముఖ్యం. దీనివల్ల మేము అధికారికంగా సినిమా డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ లో భాగమయ్యాం. దేశంలోనే ఈ లెవల్లో మొదటిసారిగా, చట్టబద్ధమైన, మంచి క్వాలిటీ ఉన్న సినిమా చూసే అనుభవాన్ని అందిస్తున్నాం" అని చెప్పారు కుటుంబాలు, స్నేహితుల బృందాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారతదేశంలో ఇది మొట్టమొదటి కమర్షియల్ థియేటర్. అంతేకాదు, థియేటర్ లోపల ఆహారంతో పాటు ఆల్కహాల్ అందించడానికి కూడా ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నుంచి లైసెన్స్ పొందడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది ప్రస్తుతం పరిశీలనలో ఉంది. ఈ ప్రాజెక్ట్‌ను నడిపించే వ్యక్తి జి.వి. శ్రీరాజ్. క్యూబ్ సినిమాతో కలిసి కొత్త సినిమాలను ప్రదర్శించే ఈ ప్రాజెక్ట్‌ను ఆయనే ప్రారంభించారు. ఆయనకు బిజినెస్, టెక్నాలజీ, ప్రజా సంబంధాలపై మంచి అవగాహన ఉంది. మాజీ ఎంపీ జి.వి. హర్ష కుమార్ కుమారుడు కావడంతో, ఆయనకు ప్రాంతీయ పరిపాల న, రాజకీయాలపై మంచి పట్టు ఉంది. శ్రీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక కాంగ్రెస్ నాయకుడు, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కూడా పాల్గొన్నారు. శ్రీరాజ్ కంప్యూటర్ సైన్స్‌లో బీ.టెక్, ఇంగ్లాండ్‌లోని లీడ్స్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ నుండి ఎంబీఏ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఉ పొలిటికల్ సైన్స్ నుండి ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో డిగ్రీ చేశారు. ఈ ప్రాజెక్ట్ సోషల్ మీడియా లో యూట్యూబర్ అన్విత వ్లాగ్స్ ద్వారా చాలా పాపులర్ అయింది. అన్విత జి.వి. శ్రీరాజ్ భార్య. ఈ థియేటర్లు ప్రకృతి వేదిక కాంప్లెక్స్‌లో భాగంగా ఉన్నాయి. ఇక్కడ ఎ3 ఫుడ్ కోర్ట్, ఒక మంచి స్విమ్మింగ్ పూల్, పెళ్లిళ్లు, పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్‌ల కోసం పెద్ద ఇండోర్, అవుట్‌డోర్ హాళ్లు కూడా ఉన్నాయి. ఇప్పుడు మొత్తం 20 సీట్ల థియేటర్‌ను బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంది.

# పుస్తకం లాంటిదే మన జీవితం !

తిరుమల, : కొత్త పుస్తకంలో అన్ని పుటలూ ఖాళీగానే ఉంటాయి. ప్రతి పుటా ఓ తెరిచిన పుస్తకమే. ఓ పుటలో పిచ్చి గీతలు గీసినా, లేక స్ఫూర్తినిచ్చే కథనాలు రాసినా అది ఆ పుస్తకంలో భాగం మాత్రమే. దాన్ని వదిలి మరో పుట తిప్పితే మరకలు లేని వర్తమానం స్వాగతం పలుకుతుంది. తెలిసో తెలియకో గత తప్పిదాల అనుభవం రెండో భాగాన్ని అర్థవంతంగా మలచుకోవడానికి ప్రేరణ కావాలి. దీన్ని జీవితానికి అన్వయిస్తే పుస్తకంలోని ప్రతి పుటా మన జీవితంలో ఓరోజు వంటిది. ప్రతి సూర్యోదయం మనకు ఆ రోజు సద్వినియోగమో దుర్వినియోగమో అయ్యేందుకు అవకాశం కల్పిస్తూనే ఉంటుంది. మునుపటి అనుభవంతో భవిష్యత్తుకు మార్గం చూపే వాక్యాలు వర్తమానంలోనే రాసుకోవాలి. ఇదంతా కూడా పాజిటివ్ దృక్పథం అలవర్చుకుంటేనే సాధ్యం అవుతుంది. నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరంలోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం. నెగెటివ్ ఎనర్జీతో నిత్యం మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొందగలం.




## రోజూ ఉదయం పచ్చి గార్లిక్‌తో రోజు ప్రారంభిస్తానంటున్న నటి

### ప్రయోజనాలు తెలిస్తే మీరూ తినక మానరు


మారుతున్న కాలానుగుణంగా ఆరోగ్య సమస్యలూ చుట్టుముడుతున్నాయి. చిన్న వయసులోనే అనేక రకాల ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఇందుకు కారణంగా జీవనశైలిలో మార్పులే కారణం. అయితే, కొన్ని ఆహారపు అలవాట్ల వల్ల అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేయొచ్చు. అందులో వెల్లుల్లి ఒకటి. మనం ఎక్కువగా వెల్లుల్లిని వంటల్లో వాడుతుంటాం. అయితే, పచ్చి గార్లిక్ తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయట. ఇదే విషయాన్ని ప్రముఖ బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ కూడా చెబుతున్నారు. తాను గత నాలుగు వారాలుగా ఉదయం ఖాళీ కడుపుతో ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బతో రోజును ప్రారంభిస్తున్నానని, దాని వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు పొందానని వెల్లడించారు. సోహా అలీఖాన్ ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ వహిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన డైట్, జిమ్ వీడియోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ నెటిజన్లు, అభిమానులకు స్ఫూర్తి నిస్తుంటారు. ఈ క్రమంలో తాజాగా వెల్లుల్లి తినడం వల్ల కలిగే ప్రయోజనాలను సోఫా వివరించారు. తాను గత నాలుగు వారాలుగా రోజూ ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి వెల్లుల్లి రెబ్బను తింటున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ చిన్న వెల్లుల్లి రెబ్బ రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటూ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుందని తెలిపారు. శరీరంలో వాపులను తగ్గిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యాన్ని సమతుల్యం చేస్తుందన్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. దాన్ని వీలైనంత ఎక్కువసేపు నమిలి నీటితో కలిపి మింగేస్తే అద్భుత ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. వెల్లుల్లి తిన్న తర్వాత కాస్త నోరు దుర్వాసన వస్తుందని.. మౌత్ వాష్ చేసుకుంటే సరిపోతుందని సూచించారు. అయితే, ఈ వెల్లుల్లి వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో దీన్ని తీసుకోకూడదని హెచ్చరించారు. రక్తాన్ని పలుచన చేసే మందులు తీసుకునేవారికి ఇది చేటు చేస్తుందని చెప్పారు. అలానే ఏదైనా సర్జరీకి సిద్ధమవుతున్న వారికి కూడా మంచిది కాదన్నారు. అలాంటి వారు వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

## పోషకాలకు దెబ్బ!



వాతావరణంలో పెరుగుతున్న వేడి, గాలిలో అధికం అవుతున్న కార్బన్ డయాక్సైడ్‌లు పంట పెరుగుదలనే కాదు అందులోని పోషకాలనూ దెబ్బతీస్తున్నాయని ఇటీవల ఓ పరిశోధన వెల్లడించింది. అందులోనూ ముఖ్యంగా ఆకుకూరల్లో ఇది అధికం అని లండన్ లివర్‌పూల్ జాన్ మూర్స్ యూనివర్సిటీకి చెందిన అధ్యయనంలో తేలింది. ఇందుకోసం పంటల్ని విశ్వవిద్యాలయ పరిసరాల్లోనే నియంతృత వాతావరణంలో పెంచారు. బ్రిటన్‌లో రానున్న రోజుల్లో అంచనా వేసిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉష్ణోగ్రత, కార్బన్ డయాక్సైడ్‌లు ఉండేలా ఏర్పాటు చేశారు. ఆ రకంగా పండిన పంటల్లో ఎలాంటి పోషకాలు ఉంటాయన్నది హై పర్ఫామెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీలాంటి అత్యంత సునిశిత పద్ధతుల్ని వాడి తెలుసుకున్నారు. పరిశోధనలో భాగంగా పాలకూర, అరుగుల ఆకు, కాలేలాంటి ఆకుకూరల్ని ప్రధానంగా పండించారు. వీటిలోని విటమిన్లు, మినరళ్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటి ఆక్సిడెంట్లలాంటి వాటిని పరిశీలించారు. ఈ నివేదిక ప్రకారం కిరణ జన్య సంయోగ క్రియ మొదలు.. పెరుగుదల, పోషకాల నిల్వ లాంటి అన్ని విషయాల్లోనూ పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువగానే ఉన్నట్టు తేలింది. ఈ వాతావరణంలో మొక్కలు త్వరగా, పెద్దగా పెరుగుతున్నాయి. కానీ కొద్దికాలం గడిచేలోపే వాటిలోని యాంటి ఆక్సిడెంట్లు, క్యాల్షియంలాంటి అత్యవసర పోషకాలు సన్నగిల్లుతున్నాయి. కాబట్టి మునుముందు మనకు ఆహారం ద్వారా అందే పోషకాల స్థాయి మీదా భూతాపం ప్రభావాన్ని తప్పక పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నమాట.

## వాయిదా వేద్దాం..



ప్రస్తుత డిజిటల్ యుగంలో.. చాలామంది స్మార్ట్‌ఫోనే ప్రపంచంగా బతికేస్తున్నారు. ఉదయం లేవగానే.. ఫోన్‌ను చేతిలోకి తీసుకుంటున్నారు. మంచం మీదినుంచే.. సోషల్ మీడియా మెసేజ్‌లు, తాజా వార్తలను తనిఖీ చేస్తున్నారు. అయితే, ఈ అలవాటు మెదడు పనితీరుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సైంటిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. ఉదయాన్నే ఫోన్‌లో తలదూర్చడం వల్ల.. ఆలోచనా విధానం, సృజనాత్మక సామర్థ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. ఉదయం మేల్కొన్న తర్వాతి మొదటి 15-20 నిమిషాలు మెదడుకు చాలా ముఖ్యమైన సమయం. అప్పుడే మెదడు 'పీక్ న్యూరోప్లాస్టిక్ మోడ్'లోకి ప్రవేశిస్తుంది. అంటే.. ఏదైనా నేర్చుకోవడానికి, మార్పులను స్వీకరించడానికి మెదడుకు ఉండే సామర్థ్యం. రాత్రంతా నిద్రలో ఉండి.. ఉదయాన్నే మేల్కొన్నప్పుడు ఈ సామర్థ్యం అత్యధిక స్థాయిలో ఉంటుందట. కాబట్టి, ఏదైనా ప్రేరణ కలగడానికి, దృష్టిని మెరుగుపరుచుకోవడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, సృజనాత్మకంగా ఉండటానికి.. మెదడుకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, ఆ సమయంలో ఫోన్‌తో గడపడం వల్ల.. మెదడు సృజనాత్మక ఆలోచనలపై ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా.. ఉదయాన్నే ఏదైనా ఇబ్బందికర సమాచారం, వార్తల గురించి విన్నప్పుడు మెదడు 'హై అలర్ట్' మోడ్‌లోకి వెళ్తుందట. మంచం మీదినుంచి లేవడానికి ముందే.. మెదడులో ఆందోళన, ఒత్తిడి పెరుగుతుందట. దీనిని నివారించడానికి '20 నిమిషాల ట్రిక్'ను అనుసరించాలని చెబుతున్నారు. నిద్ర లేచిన వెంటనే కాకుండా ఫోన్‌ను చూడటాన్ని 20 నిమిషాలు ఆలస్యం చేయాలని చెబుతున్నారు. మొదటి 20 నిమిషాలు ప్రశాంతంగా, సానుకూలంగా ఏదో ఒక పనిచేయాలని సూచిస్తున్నారు. చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌లు చేయడం, రోజువారీ చేయాల్సిన పనుల లిస్ట్‌ను తయారు చేసుకోవడం, ప్రధాన లక్ష్యాల గురించి ఆలోచించడం చేయాలని అంటున్నారు. ఈ చిన్న మార్పు.. మెదడుపై సానుకూల ప్రభావం చూపుతుందనీ, ఏకాగ్రత, సంతోషం పెరుగుతాయనీ చెబుతున్నారు.

### శాతవాహనలో బాలుర హాస్టల్ వార్డెన్ గా డా.కిరణ్ నియామకం

శాతవాహన విశ్వవిద్యాలయ బాలుర వసతి గృహ వార్డెనుగా వృక్షశాస్త్ర విభాగ అధిపతి సహాయ ఆచార్యులు డాక్టర్ సాయిని కిరణ్‌నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ఆదేశాలతో రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవి కుమార్ నియామక పత్రాన్ని అందచేసారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి డా.సురేష్ కుమార్, ఓఎస్డి టు విసి డా.హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జయంతి, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు డా.కిరణ్ ను అభినందించారు.



## లక్షణాలు గుర్తిస్తే.. ప్రమాదం దూరం

క్యాన్సర్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా క్యాన్సర్ మహమ్మారి అందర్నీ ప్రమాదంలోకి నెట్టేస్తున్నది. అయితే క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాన్ని తగ్గించొచ్చు. సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ప్రాణాపాయస్థితి నుంచి బయటపడి, సాధారణ జీవితం గడపొచ్చు. చాలామంది క్యాన్సర్ లక్షణాలపై అవగాహన లేక సమస్యను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ పది లక్షణాలను గమనించి, వెంటనే వైద్యుణ్ని సంప్రదిస్తే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చు.

అకస్మాత్తుగా బరువు తగ్గడం: ఒకే నెలలో నాలుగైదు కిలోలు తగ్గుతున్నారంటే జాగ్రత్త పడాలి. కిలోల కొద్దీ బరువు ఒకేసారి తగ్గితే, అది కడుపు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, క్లోమ క్యాన్సర్ లక్షణం కావచ్చు.

ఎక్కువ అలసట: చిన్నచిన్న పనులకే ఎక్కువగా అలసిపోతున్నా, అది క్యాన్సర్ లక్షణం కావచ్చు. లుకేమియా లేదా లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్లలో కూడా ఈ లక్షణం ఉంటుంది.

కణితులు: మెడ, చంక మొదలైన చోట్ల కొత్తగా గడ్డలు కనిపించినా, లేదాచిన్న గడ్డలుగట్టిపడినా,పెద్దగాపెరిగినా వెంటనేడాక్టర్‌ను సంప్రదించాలి. అదిరొమ్ము,వృషణాలు,శోషరస సంబంధితక్యాన్సర్ కావచ్చు.


చర్మం-పుట్టుమచ్చల్లో మార్పు: కొత్త పుట్టుమచ్చలు పుట్టుకురావడం, పాత మచ్చల రంగు, పరిమాణంలో మార్పులు, వాటిలోంచి రక్తం రావడం లాంటివి క్యాన్సర్ లక్షణాలుగా చెబుతారు. అందుకే చర్మ సమస్యలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దు.

బ్లీడింగ్ ప్రమాదమే: మూత్రం, మలం, వాంతి, దగ్గులో రక్తం కనిపిస్తే, వెంటనే అప్రమత్తం అవ్వాలి. అవన్నీ మూత్రాశయ, పెద్దపేగు, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలు ఉంటాయి.

ఆగని దగ్గు: వారాలు గడిచినా దగ్గు తగ్గకుండా, రక్తం పడుతున్నట్లయితే అది కేవలం ఇన్ఫెక్షన్ కాకపోవచ్చు. గొంతు, ఊపిరితిత్తులు, థైరాయిడ్ క్యాన్సర్‌కు సూచన అనుకొని జాగ్రత్తపడటం మంచిది.

అజీర్తి-మింగడంలోఇబ్బంది: ఆహారం మింగడంలో ఇబ్బందిగా ఉన్నా,ఛాతీలోమంట, అజీర్తి సమస్యలుదీర్ఘకాలంగా ఉంటే,వెంటనే అప్రమత్తం అవ్వాలి.అది గొంతు,కడుపు,అన్నవాహికక్యాన్సర్‌కు దారితీయొచ్చు.


విసర్జన వేళల్లో మార్పులు: మల విసర్జన సమయాల్లో మార్పులు, అతిసారం, మలబద్ధకం, మలంలో రక్తం, మూత్రంలో మంట



మొదలైనవి మూత్రాశయ, పెద్దపేగు, వీర్యగ్రంథి క్యాన్సర్ లక్షణాలు. వీటిలో ఏవి ఎక్కువ రోజులున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

విపరీతమైన నొప్పి: ఎముకలు, క్లోమం, అండాశయాల్లో క్యాన్సర్ ఉన్నప్పుడు.. కడుపు, వీపు లేదా కీళ్లలో నొప్పి విపరీతంగా ఉంటుంది. రోజులు గడిచినా ట్యాబ్లెట్లతో తగ్గకుంటే, వైద్యుణ్ని కలవడం అవసరం. రాత్రుళ్లు చెమటలు: తరచూ జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, వరుసగా ఇన్ఫెక్షన్లు లాంటివి కూడా క్యాన్సర్ లక్షణాలు అయ్యుండొచ్చు. ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇవి దీర్ఘకాలం కొనసాగితే మాత్రం జాగ్రత్తపడటం తప్పనిసరి. కీడెంచి మేలెంచడం మంచిది కదా! ఈ తరహా లక్షణాలు వారాల తరబడి అలాగే కొనసాగుతూ ఉంటే.. వైద్యుణ్ని సంప్రదించడం తప్పనిసరి.

## గుండె బలహీన పడిందనేందుకు ప్రధాన సంకేతాలు



హృద్రోగ లక్షణాలంటే మనకు సాధారణంగా ఛాతిలో నొప్పే గుర్తుకు వస్తుంది. అయితే, ఆహారం అరగకపోవడం, దగ్గు, గాయాలు వంటివి కూడా ఛాతి నొప్పికి కారణంగా కావచ్చు. ఇక గుండె బలహీన పడిందనేందుకు ఇతర అనేక లక్షణాలు కూడా ఉన్నాయి. మరి అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటే అనుమానించాల్సిందే. గుండెకు రక్తప్రసరణ తగ్గినప్పుడు ఊపిరితిత్తుల్లో నీరు పేరుకుంటుంది. ఇలాంటప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి. తగినంత రెస్టు తీసుకున్నా కూడా నీరసం వదలట్లేదంటే గుండె బలహీనపడిందని అర్థం. గుండె ద్వారా కండరాలు, ఇతర శరీర భాగాలకు ఆక్సిజనేటెడ్ రక్తం తగినంతగా సరఫరా కాకపోతే ఇలాంటి పరిస్థితి తలెత్తుతుంది. మెట్లు ఎక్కాలన్నా, బరువైన వస్తువులు మోసుకెళ్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతాయి. ఎంత రెస్టు తీసుకున్నా నిత్యం నీరసం వేధిస్తోందంటే వెంటనే అప్రమత్తం కావాలని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో రక్తప్రసరణ సజావుగా సాగాలంటే గుండె ఆరోగ్యంగా ఉండాలి.

గుండె బలహీనపడ్డ సందర్భాల్లో రక్తాన్ని ఇతర భాగాలకు పూర్తిస్థాయిలో పంప్ చేయలేదు. దీంతో, శరీర భాగాల్లో పలు చోట్ల నీరు (ఫ్లూయిడ్స్) పేరుకుంటు ంది. దీన్ని వైద్య పరిభాషలో ఎడిమా అని అంటారు. కాళ్లు, మడమల్లో వాపునకు ఎడిమానే కారణం.ఒకే చోట కదలకుండా కూర్చొంటే ఈ వాపు మరింత ఎక్కువ అవుతుంది. ఎడిమా ఉన్నప్పుడు ఒక్కోసారి దిగువ శరీర భాగం మొత్తం బరువుగా అనిపిస్తు ంది. గుండె చలనంలో మార్పులపై నిత్యం దృష్టి పెట్టిఉంచాలి. గుండెఆరోగ్యానికిఇది ప్రధాన సంకేతం. గుండె చలనంలో అసాధారణ మార్పులు (ఎరిథ్మియా), దడ ఎక్కువ గా వస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. గుండె బలహీనప డ్డప్పుడు మెదడుకు కూడా రక్త సరఫరా తగ్గుతుంది. ఫలితంగా తలతిరగటం, స్పృహతప్పడం, నిత్యం మత్తుగా ఉండటం వంటి సమస్యలు మొదలవుతాయి. కాస్త శ్రమ పడ్డా కూడా శరీరం వణుకుతున్నట్టు అనిపిస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే గుండె బలహీనపడుతున్నట్టుగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

## రాత్రి పూట యాలకుల పాలను తాగితే ఎన్నో లాభాలు..



యాలకులు మన వంట ఇంట్లో సుగంధ ద్రవ్యాలుగా ఎప్పటి నుంచో ఉన్నాయి. మసాలా వంటకాల్లో యాలకులను ఎక్కువగా వేస్తుంటారు. చికెన్, మటన్ తోపాటు శాకాహార మసాలా వంటకాలు, స్వీట్లలో యాలకులను ఉపయోగిస్తారు. దీంతో వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే యాలకులను రాత్రి పూట పాలలో మరిగించి ఆ పాలను తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. యాలకుల పాలను రోజూ తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. యాలకుల పాలను తాగడం వల్ల ట్రిప్టోఫాన్ లభిస్తుంది. ఇది ఒక అమైనో యాసిడ్. నిద్రను ప్రేరేపిస్తుంది. శరీరంలో సెరొటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి ఉన్నవారు రాత్రి పూట యాలకుల పాలను తాగితే ప్రయోజనం ఉంటుంది.

మానసిక ఆరోగ్యానికి..: యాలకుల పాలను తాగడం వల్ల నాడీ మండల వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి డిప్రెషన్ నుంచి బయట పడతారు. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. మెదడు చురుగ్గా మారి యాక్టివ్ గా ఉంటుంది. మరుసటి రోజు ఉత్తేజంగా పనిచేస్తారు. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. అసిడిటీ, కడుపు నొప్పి ఉన్నవారు ఈ పాలను తాగితే ఎంతగానో ప్రయోజనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. యాలకుల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో

### కచ్చితంగా రోజూ తాగండి..!

కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

బీపీ తగ్గేందుకు..: యాలకుల్లో పొటాషియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తాయి. యాలకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. యాలకుల పాలను తాగడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా రక్షించుకోవచ్చు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా గుండె పోటు రాకుండా ఉంటుంది. యాలకుల్లో సహజసిద్ధమైన యాంటీ మైక్రోబియల్, యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకుల పాలను సేవిస్తే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

వాపులు, నొప్పులకు..: యాలకుల పాలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ సమస్య తగ్గుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలకుల పాలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి, అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా రక్షిస్తాయి. ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మెటబాలిజం పెరిగేలా చేస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఒక కప్పు పాలలో 2 లేదా 3 యాలకులను వేసి బాగా మరిగిస్తే యాలకుల పాలు రెడీ అవుతాయి. కాస్త తేనె కలిపి తాగితే రుచిగా ఉండడమే కాదు, అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

# సినిమా



## విశ్వంభర సెట్స్‌లో చిరంజీవితో మౌనీ రాయ్..






మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర' షూటింగ్ చివరి దశకు చేరింది. 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న ఈ భారీ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో, ముఖ్యంగా మెగా ఫ్యాన్స్‌లో భారీ స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వింటేజ్ చిరు మేజిక్‌ను మళ్లీ వెండితెరపై చూపించే ప్రయత్నంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన దర్శకుడు మల్లిడి వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 14 లోకాల్లో హీరోయిన్ కోసం హీరో చేసే యాత్రే ఈ కథ యొక్క కేంద్ర బిందువుగా తెలుస్తుంది. విశ్వంభర చిత్ర కథకు ప్రేరణగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'పాతాళ భైరవి', 'కీలు గుర్రం'చిత్రాలు నిలిచాయి. భారీ విజువల్స్, గ్రాఫిక్స్‌తో ఫుల్ స్కేల్ ఫాంటసీ మూవీగా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో చిరంజీవికి జోడిగా సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ నటిస్తుంది. చాలా కాలం తర్వాత చిరుతో త్రిష కలిసి పనిచేయడం అభిమానులకు ఇది మంచి సర్‌ప్రైజ్ కావొచ్చు. ఇక సినిమా స్పెషల్ ఎలిమెంట్‌గా బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ పర్ఫార్మ్ చేయబోయే స్పెషల్ సాంగ్ కానుంది. ఈ పాట చిరంజీవి ఐకానిక్ సినిమా గ్యాంగ్ లీడర్‌లోని ఎవర్‌గ్రీన్ మాస్ సాంగ్ 'రగులుతోంది మొగలిపొద' కు రీమిక్స్ అని తెలుస్తోంది. మౌనీ రాయ్ 'నాగినీ' సీరియల్, 'బ్రహ్మాస్త్ర' వంటి ప్రాజెక్టుల వల్ల ఇప్పటికే మంచి ఫేమ్ సంపాదించగా, ఈ పాటతో టాలీవుడ్‌లో తన క్రేజ్ మరింత పెరుగుతుందన్నదాంట్లో సందేహం లేదు. తాజాగా విశ్వంభర సెట్‌లో చిరంజీవితో కలిసి మౌనీ రాయ్ దిగిన పిక్ ఒకటి బయటకు వచ్చింది. ఈ పిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అయింది. ఈ పిక్‌తో విశ్వంభర చిత్రంలో మౌనీరాయ్ స్పెషల్ సాంగ్ చేస్తుందనే దానిపై ఫుల్ క్లారిటీ వచ్చింది. 'విశ్వంభర' చిత్రాన్ని UV క్రియేషన్స్ పతాకంపై వంశీ కృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా బడ్జెట్ రూ. 200 కోట్లకు పైగా వెచ్చించినట్టు సమాచారం. విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ కాస్ట్, ప్రొడక్షన్ విలువలు అన్ని కూడా ఆకట్టుకునేలా ఉంటాయట. ఈ చిత్రంలో ఆషికా రంగనాథన్, ఇషా చావ్లా కూడా ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండటంతో మ్యూజికల్‌గా కూడా సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సెప్టెంబర్‌లో మూవీ విడుదలయ్యే అవకాశం ఉంది.

## మినీ స్కర్ట్‌లో అషు గ్లామర్ బ్లాస్ట్



టాలీవుడ్ గ్లామర్ వరల్డ్‌లో అడుగుపెట్టిన తర్వాత అషు రెడ్డి స్టైల్, స్వాగ్‌కి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. బిగ్ బాస్ షోలో తన ఉత్సాహభరితమైన బాడీ లాంగ్వేజ్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి నెట్టింట తెగ దూసుకుపోతోంది. షేర్ చేసిన ఫోటోషూట్‌లో అషు రెడ్డి రెడ్ కలర్ ఫ్లోరల్ టాప్, బ్లాక్ మినీ స్కర్ట్‌లో స్టన్నింగ్‌గా మెరిసిపోయింది. ఈ లుక్‌లో ఆమె వేషధారణ మాత్రమే కాదు, హైహీల్స్, హెయిర్ ఫ్లిప్, ఎక్స్‌ప్రెషన్లు అన్నీ కలసి ఒక స్టైలిష్ స్టేట్మెంట్ లా మారాయి. "నా హీల్స్ నిన్ను ఎత్తుగా చేస్తాయని నాకు తెలుసు. అనే క్యాప్షన్‌తో ఆమె పోస్ట్‌కి యూత్ నుంచి రెస్పాన్స్ జెట్ స్పీడ్‌లో వచ్చింది. వేలల్లో లైకులు, ఆకట్టుకునే కామెంట్లతో ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూస్తే క్లాస్‌కు గ్లామర్ ఎలా జోడించాలో అషుతో నేర్చుకోవాలి అంటున్నారు నెటిజన్స్. ఇక అషు కెరీర్ విషయానికొస్తే, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ బ్యూటీ, డబ్‌స్మాష్‌తో మొదలైన ప్రయాణం టీవీ నుంచి సినిమాల వరకు విస్తరించింది. బిగ్ బాస్ సీజన్ 3 ఆమెకు మంచి గుర్తింపు తీసుకువచ్చింది. ఆ షో ద్వారా ఆమె మాస్ ఆడియెన్స్‌లో తన ప్రత్యేకతను చూపించింది. ఆ తర్వాత కొన్ని స్పెషల్ షోలు, ఈవెంట్ హోస్టింగ్, గ్లామర్ ఫోటోషూట్లతో తనదైన గుర్తింపును క్రియేట్ చేసుకుంది. అషు రెడ్డి స్పష్టంగా తెలుసుకొని ప్రయాణిస్తున్న విషయమేమిటంటే గ్లామర్ ద్వారా క్రేజ్ తెచ్చుకుంటే దానిని మెయింటైన్ చేయడమే అసలైన ఆర్ట్. ఆమె ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ చూస్తేనే తెలుస్తుంది.. ప్రతీ ఫోటోలో ఓ థీమ్ ఉంటుంది, ఒక ఫీల్ ఉంటుంది. ముఖ్యంగా స్టైలింగ్, మేకప్, పోజింగ్, డ్రెస్సింగ్ డిజైన్ అన్నిటిలోనూ ఎంతో కేర్ తీసుకుంటుంది. మొత్తానికి, అషు రెడ్డి ఈ తాజా గ్లామర్ ఫోటోషూట్‌తో మరోసారి తన స్థాయిని నిరూపించుకుంది.

## నేను వారితో కలవడం మా ఆయనకి నచ్చదు



అందాల ముద్దుగుమ్మ అనసూయ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. యాంకర్‌గా, నటిగా అశేష ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే అనసూయ గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కుర్రాళ్లకి కంటిపై కునుకు లేకుండా చేస్తుంటుంది. ఇక ఇంటర్వ్యూలలో ఆమె ఏ విషయంపైనైన చాలా ఓపెన్‌గా మాట్లాడుతుంది. తాజాగా తన భర్తకి సంబంధించిన కొన్ని విషయాలు చెప్పుకొచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది మా ఆయన పర్‌ఫెక్ట్ అని అందరు అనుకుంటారు. కాని ఆయన కూడా అందరి మగాళ్లలాగే . మా ఇద్దరి మధ్య కూడా కొన్ని సందర్భాలలో గొడవలు అయ్యాయి. నేను వెళ్లి కొంతమందిని కలవడం. కొంతమందితో సినిమాలు చేయడం ఆయనకి నచ్చలేదు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడుతూ గొడవలు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. నేను హీరోలతో.. పెద్ద పెద్ద స్టార్‌లతో.. గుడ్ లుకింగ్ పీపుల్స్‌తో ఇంట్రాక్ట్ అయినప్పుడు చాలా ఇబ్బంది పడేవారు. అబ్బాయిల మనస్తత్వమే అది. నన్ను ఫ్లర్ట్ చేయడం కావచ్చు.. కాంప్లిమెంట్ కావచ్చు.. ఆయన తీసుకోలేరు. సాధారణంగా అందరు కూడా అనసూయ భర్త అన్నీ చేయనిస్తాడు, అన్నింటికి ఒప్పుకుంటాడు అని అందరు అనుకోవచ్చు. వాడు చేతకాని వాడు అని కూడా అంటారు. అదృష్టం ఏంటంటే మా ఆయనకి తెలుగు రాదు.

సోషల్ మీడియాలో కామెంట్స్ పట్టించుకోడు. ఆయనలా ఉండాలని ఎన్నోసార్లు అనుకుంటాను. నేను మా ఆయనతో ఉన్నట్టు వేరే వాళ్లతో ఉండలేను. నాకు వేరే వ్యక్తి బ్యాడ్‌గా అనిపిస్తే.. నేను అతనికి బ్యాడ్‌గా కనిపిస్తా. అది హ్యూమన్ బిహేవియర్ అంతే. నేను కూడా మా ఆయనతో ఇన్‌సెక్యూరీగా ఫీల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అనసూయకి అసూయ అనేది వాళ్ల ఆయన దగ్గర మాత్రమే ఉంటుంది. ఇంకెక్కడా ఉండదు. నేను మోస్ట్ సెక్యూర్డ్ పర్సన్‌ని.

ఆయన కూడా అలాగే ఫీల్ అవుతారు అని అనసూయ పేర్కొంది. ఇక మన అన్నతో మనకి విడాకులు ఉండవు. అమ్మతో విడాకులు ఉండవు.. అక్కతో ఉండవు. కానీ కేవలం భార్యతోనే ఉంటుంది. పెళ్లి అనే దానికి మన భారతీయ సాంప్రదాయంలో ఇచ్చేటంత గౌరవం మరెక్కడ కూడా ఇవ్వరు. అయితే ఈ మధ్య విడాకుల వలన విలువలు తగ్గించుకుంటు న్నారు. ఓపిక,అడ్జెస్ట్‌మెంట్ వల్లనే బంధాలు నిలబడతాయి. ఈ జనరేషన్ వారికి అంత ఓపిక లేదని అనసూయ పేర్కొంది.

## మరోసారి గొప్ప మనసు చాటుకున్న సోనూసూద్

**నిన్న 52వ బర్త్‌డే సందర్భంగా సోనూసూద్ కీలక నిర్ణయం**

**వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన నటుడు**

**500 మంది వృద్ధులకు ఇందులో ఆశ్రయం కల్పించనున్నట్లు వెల్లడి**



నటుడు సోనూసూద్ మరోసారి గొప్ప మనసుచాటుకున్నారు. నిన్న తన 52వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మరోగొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 500మంది వృద్ధులకు ఇందులో ఆశ్రయం కల్పించనున్నట్లు తెలిపారు. ఎవరూ లేని వృద్ధులకు సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఇందులోవృద్ధులకు ఆశ్రయం ఇవ్వడంతో పాటు వైద్య సంరక్షణ, పోషకాహారం కూడా అందించనున్నట్లు తెలిపారు. దీంతో ఈ రియల్ హీరోపై మరోసారి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, సోనూసూద్ మహమ్మారి కరోనా సమయంలో దేశంలో ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి రియల్ హీరో అనిపించుకున్న విషయం తెలిసిందే. ఎంతోమంది సాయం చేసి ఆదుకున్నారాయన.

## మయసభ ట్రైలర్.. స్నేహితులు, రాజకీయ ప్రత్యర్థులుగా మారితే..




ప్రేక్షకులకు విభిన్నమైన కంటెంట్‌ను అందించడంలో ముందున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ సోనీ లివ్. ఇప్పుడు రాజకీయ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'మయ సభ' ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. "రైజ్ ఆఫ్ ది టైటాన్స్" అనేది ఈ సిరీస్ ట్యాగ్ లైన్. సీనియర్ దర్శకుడు దేవా కట్టా దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ ఆగస్టు 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్‌కి నిర్మాతలుగా విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష వ్యవహరించగా, హిట్ మ్యాన్, ప్రూడోస్ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై తెరకెక్కింది. ముఖ్య పాత్రల్లో ఆది పినిశెట్టి, చైతన్య రావు, దివ్య దత్తా, సాయికుమార్, శత్రూ, శ్రీకాంత్ అయ్యంగార్, తన్య రామచంద్రన్, రవీంద్ర విజయ్ తదితరులు నటించారు. ఈ కథకు ప్రేరణగా ఏపీ రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన నేతలు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మధ్య ఉన్న స్నేహం, అనంతరం వారిద్దరి మధ్య ఏర్పడిన రాజకీయ విరోధతను తీసుకున్నట్టు దేవా కట్టా తెలిపారు. అయితే ఇది పూర్తిగా కల్పితమైన కథేనని, కొన్ని సంఘటనలు మాత్రం కాల్పనికంగా మలిచామని ఆయన స్పష్టం చేశారు. ఒకే లక్ష్యంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఇద్దరు స్నేహితులు, తర్వాత దారి మార్చుకొని విడిపోయిన సందర్భాలను బలంగా చూపించనున్నట్టు చెప్పారు.తాజాగా విడుదలైన ట్రైలర్ పలు సంచలనాత్మక డైలాగ్‌లతో సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. ఇద్దరు స్నేహితులు రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారన్న పాయింట్‌తో ఈ వెబ్ సిరీస్‌ని రూపొందించారు. ట్రైలర్‌లోని సన్నివేశాలు, డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. జీవితంలో ఏదో సాధించాలి, ప్రజలకు అండగా నిలబడాలనే లక్ష్యంతో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఇద్దరు స్నేహితుల ప్రయాణం ఎలా సాగింది? కలిసి తిరిగిన వారు రాజకీయ గమనంలో ప్రత్యర్థులుగా మారడానికి కారణాలు ఏంటి? ఇద్దరి గొప్ప స్నేహితుల మధ్య ఉ ఒడే స్నేహం, మానసిక సంఘర్షణ.. పొలిటికల్ జర్నీలో వారు ఎదుర్కొన్న పరిస్థితులను భావోద్వేగంగా మయసభ వెబ్ సిరీస్‌లో ఆవిష్కరించనున్నట్టు తెలుస్తుంది.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215